## భయంకరంగా ఏనుగుల స్వైరవిహారం

**పీలేరు కె.వి.పల్లి జూలై 19 ప్రభాతవార్త:**

నియోజకవర్గంలోని కేవీ పల్లె మండలం జిల్లేళ్లమంద సమీప అటవీ ప్రాంతంలో ఏనుగుల గుంపు సంచారం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. నాలుగైదు రోజులుగా సంచరిస్తున్న గజరాజులు శేషాచలం సమీపంలోని మామిడి, కొబ్బరి, అరటి తోటలపై దాడి చేసి భారీ నష్టం కలిగించాయి. మామిడి, కొబ్బరి చెట్లను నేలమట్టం చేయడంతో పాటు సాగునీటి పైపులు, కంచెలు, రాతి కూసాలను ధ్వంసం చేశాయి. జిల్లేళ్లమంద గ్రామానికి చెందిన సుమారు 20 మంది రైతులు రూ.లక్షల్లో నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ పొలాల వద్దకు వెళ్లేందుకు కూడా భయపడుతున్నామని రైతులు చెబుతున్నారు. ఏనుగుల బెడదను అరికట్టేందుకు అటవీ శాఖ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని, నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.




వైఎస్ఆర్

# కడప-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

సోమవారం 20 జూలై 2026





# జనసంద్రమైన శక్తి క్షేత్రం..

### బోయకొండలో ఆషాఢ ఆదివారం భక్తుల కోలాహలం

స్తంభించిన ట్రాఫిక్

మురాయించిన సేవా సర్వర్లు

ఇబ్బంది పడ్డ భక్తులు

**చౌడేపల్లి జూలై 19 ప్రభాతవార్త**

ప్రముఖ శక్తి క్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం ఆషాఢ మాసం ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచే కాకుండా సాయంత్రం వరకు ఎన్నడూ లేనివిధంగా భక్తుల రద్దీ అసాధారణంగా కొనసాగింది. ఆలయ పరిసరాల్లో ఎటు చూసినా భక్తులే కనిపిస్తూ, బోయకొండ క్షేత్రం అంతా భక్తజన సంద్రంగా మారింది. ఆలయంలో వివిధ సేవా టికెట్ల విక్రయాల వద్ద అంతర్జాలంలో సర్వర్ మోరాయించడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు భక్తుల రద్దీ అధికంగా ఉన్న సమయంలో ప్రత్యామ్నాయ మార్గాలు చూడాల్సి ఉందని పలువురు భక్తులు అధికారులను నిలదీయడం కనిపించింది అధిక సంఖ్యలో తరలివచ్చిన యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో, ఉప కమిషనర్ ఏకాంబరం ముందస్తుగా మోలిక వసతులను సమకూర్చారు. భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా క్యూలైన్లను క్రమబద్ధీకరిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. భక్తుల రద్దీ భారీగా ఉండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా రణభేరి గంగమ్మ ఆలయం నుండి అమ్మవారి పుష్కరిణి వరకు యాత్రికులు తమ వాహనాలను





ఎక్కడ పడితే అక్కడ నిలిపివేయడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీని వల్ల కాలినడకన వచ్చే భక్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరిస్థితిని గమనించిన పుంగనూరు రూరల్ సీఐ సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో, ఎస్సై చిన్న రెడ్డప్ప తమ సిబ్బందితో కలిసి రంగంలోకి దిగారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. ఆషాడ మాసం ఆదివారం సమయాలలో మధ్యాహ్నం మూడు గంటల వరకు వీఐపీ దర్శనాలు రద్దు చేస్తున్నట్లుగా ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం తెలియజేశారు యాత్రికుల రద్దీకి అనుగుణంగా పలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు మదనపల్లి నుంచి వచ్చిన చిన్నారుల కోలాట భక్తులను అలరించింది.

## నేడు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మదనపల్లెకు రాక

**మదనపల్లె, జూలై 19 ప్రభాతవార్త :**

అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రోడ్లు, భవనాలు, మౌళిక సదుపాయాలు, పెట్టుబడులు శాఖామంత్రి బిసి జనార్థన్‌రెడ్డి సోమవారం మదనపల్లెకు విచ్చేస్తున్నట్లు పార్లమెంటరీ జిల్లా అధ్యక్షులు సుగవాసి ప్రసాద్‌బాబు, ప్రధాన కార్యదర్శి పఠాన్‌ఖాదర్‌ఖాన్‌లు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు సిటిఎం రోడ్డులోని దేవతానగర్ వద్ద ఉన్న టిడిపి పార్లమెంటరీ కార్యాలయంలో నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు, సూచనలు, పార్టీ అంశాలపై ప్రత్యేక వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరై తమ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన అంశాలు, ప్రజాసమస్యలు, పార్టీ బలోపేతానికి సంబంధించిన సూచనలు మంత్రి దృష్టికి తీసుకెళ్ళాలని వారు కోరారు. అనంతరం ప్రభుత్వం అధికారికంగా చేపట్టిన మైస్కూల్-మైఫ్రెండ్ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని వారు తెలిపారు.

## మఠం మాడవీధుల్లో ట్రాఫిక్ అస్తవ్యస్తం..

### ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ భక్తుల ఇబ్బందులు

**బ్రహ్మంగారిమఠం జూలై 19 ప్రభాతవార్త**

భూత భవిష్యత్ వర్తమాన కాలజ్ఞానాన్ని రచించిన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం మాడవీధుల్లో వాహనాల పార్కింగ్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతుంది. గుడికి వచ్చి భక్తులు వాహనాలు రోడ్లకు అడ్డంగా పెట్టడం వల్ల వచ్చిపోయే భక్తులు అక్కడే ఉన్నటువంటి దుకాణదారులు ఇబ్బంది పడుతున్నారు. గుడి సమీపంలో టీటీడీ సముదాయంలో పార్కింగ్ స్థలం వున్న, నో పార్కింగ్ బోర్డులు లేక,ట్రాపిక్ లో పోలీస్ లు లేక,వాహనాలలో వచ్చే భక్తులు వ్యాపార సముదాయాల ముందు పార్కింగ్ చేసి పోతున్నారు. అలాగే స్థానికులు కూడా మాడ వీధులలో మోటార్ సైకిల్ వెళ్ళడంతో ట్రాఫిక్ ఎక్కువగా వుంది, కనుక దేవస్థానం వారు పోలీస్ వారు ట్రాపిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి. అలాగే పారిశుధ్యం పైన కూడా చొరవ చూపాలి. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై సంబంధించిన అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు గ్రామస్తులు కోరుతున్నారు.



# మై స్కూల్-మై ఫ్రెండ్‌తో విద్యారంగంలో పురోగతి

### నేడు మంత్రిచే షైనింగ్ స్టార్స్ అవార్డు ప్రధానం : జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్

**మదనపల్లె, జులై 19 ప్రభాతవార్త :**

మైస్కూల్-మైఫ్రెండ్ కార్యక్రమం విద్యార్థుల విద్యాప్రగతికి ఎంతో దోహదపడిందని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడమే షైనింగ్ స్టార్స్-2026 అవార్డుల ప్రధానోత్సవం సోమవారం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బిసి.జనార్ధన్‌రెడ్డి ముఖ్య అతిధిగా హాజరవుతారన్నారు. 2026సంవత్సరంలో నిర్వహించిన ఎస్ఎస్‌సి, ఇంటర్ మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో అత్యధిక మార్కులు సాదించిన ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ అవార్డు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. జిల్లాలో 157మంది పదవ తరగతి విద్యార్థులు, 31మంది ఇంటర్‌మీడియట్ విద్యార్థులు అవార్డులకు ఎంపికయ్యారన్నారు. వీరికి ప్రశంసాపత్రంతో పాటు నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. మైస్కూల్-మైఫ్రెండ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఉన్నత పాఠశాలకు ఒక గెటిజ్ అధికారిని దత్తత అధికారిగా నియమించి వారానికి రెండుసార్లు పాఠశాలలను సందర్శించేలా చేసి విద్యార్థుల అభ్యస పురోగతిని పర్యవేక్షిస్తారన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో వారానికి ఒక్కసారి సమీక్ష సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పథకం ద్వారా అన్నమయ్య జిల్లా విద్యాబివృదిలో గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. రాయలసీమ జోన్‌లోని ఎనిమిది జిల్లాల ప్రథమ స్థానాన్ని అన్నమయ్య జిల్లా కైవసం చేసుకొందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలల ఉత్తీర్ణతలో రాష్ట్రస్థాయిలో 9వ స్థానం వచ్చి విద్యారంగంలో తన ప్రతిభను చాటుకొందన్నారు.



## శ్రీ బ్రహ్మర్షి పత్రీజీ బయోపిక్ ప్రదర్శన



**ప్రొద్దుటూరు అర్బన్, జూలై 19 ప్రభాతవార్త**

ప్రపంచవ్యాప్తంగా ఆదివారం శ్రీ బ్రహ్మర్షి పత్రీజీ బయోపిక్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు లోని ది ప్రొద్దుటూరు స్పిరిచువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 3వ పేజీలో

## యువత ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలి

### బిజెపి పట్టణ రెండవ అధ్యక్షులు పాలెం రెడ్డి కిరణ్

**ప్రొద్దుటూరు, జులై 19 ప్రభాతవార్త**

యువత ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని బీజేపీ ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు పాలెం రెడ్డి కిరణ్ అభిప్రాయపడ్డారు. ఆదివారం బీజేవైఎం ప్రొద్దుటూరు పట్టణ అర్బన్2 నూతన కార్యవర్గాన్ని పాలెం రెడ్డి కిరణ్ నియమించారు. అర్బన్2 కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నూతన బాధ్యతలు స్వీకరించిన సభ్యులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా పాలెం రెడ్డి కిరణ్, సి.వి. జయలక్ష్మి, పర్లపాడు గౌరీశంకర్, బి. జయలక్ష్మి, విక్రాంత్ మాట్లాడుతూ బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, యువత సామాజిక బాధ్యతతో పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతన బీజేవైఎం అర్బన్2 అధ్యక్షుడిగా సాయి అభినయ్, ఉపాధ్యక్షులుగా సునీల్ కుమార్, సప్తగిరి యాదవ్, కార్యదర్శులుగా రమణ, చందు, జనరల్ సెక్రటరీలుగా దస్తగిరి, లోకేష్ యాదవ్, ట్రెజరర్‌గా పవన్ కుమార్, సోషల్ మీడియా కన్వీనర్‌గా చరణ్ నియమితులయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సూర్య ప్రకాష్, యశ్వంత్, వరుణ్, గురుహేమంత్ బాధ్యతలు చేపట్టారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు సహపంక్తి భోజనం చేశారు. నూతన కార్యవర్గం క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.



### సాంఘిక సంక్షేమ బాల,

# వసతిగృహాల్లో దుస్తుల పంపిణీ

**వేంపల్లె: జూలై 19 ప్రభాతవార్త**




వేంపల్లెలోని హనుమాన్ జంక్షన్ సర్కిల్ వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహంలో ప్రభుత్వం అందజేసిన దుస్తులు, నిత్యావసర వస్తువులను విద్యార్థులకు ఘనంగా పంపిణీ చేశారు. వార్డెన్ మాణిక్యం రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు దుప్పట్లు, టర్కీ టవల్స్, స్వెటర్లు, రెండు జతల టీషర్టులు, ప్యాంట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వసతిగృహ విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. ఇంటి కంటే మెరుగైన వసతి, పోషకాహారం, రవాణా సౌకర్యం, ప్రత్యేక బోధన కోసం ట్యూటర్లను ఏర్పాటు చేయడం వంటి చర్యలు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చేపడుతున్నవేనని పేర్కొన్నారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ వసతిగృహ నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న వార్డెన్ మాణిక్యం రావును, హాస్టల్ సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. విద్యార్థులను సొంత పిల్లల్లా చూసుకుంటూ వారి విద్యాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు ధర్మారెడ్డి, గోపాల్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు కూడా వార్డెన్ మాణిక్యం రావు తమపై చూపుతున్న ప్రత్యేక శ్రద్ధకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతిగృహంలో వార్డెన్ సుజాత అధ్యక్షతన విద్యార్థినులకు కూడా ప్రభుత్వం అందజేసిన దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, హాస్టల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తిరువెంగళపురంలో 40 కుటుంబాలు టీడీపీలో చేరిక

**బద్వేలు అర్బన్, జూలై 19, ప్రభాతవార్త**

బద్వేలు మండలం తిరువెంగళపురంలో వైఎస్సార్‌సీపీకి చెందిన 40 కుటుంబాలు శనివారం తెలుగుదేశం పార్టీలో చేరాయి. గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు అక్కడికి చేరుకున్న బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, ఉమ్మడి కడప డీసీసీ బ్యాంకు చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డికి గ్రామస్తులు మేళ తాళాలతో ఘన స్వాగతం పలికారు. టీడీపీ నాయకుడు బిజివేముల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బిజివేముల జగన్‌మోహన్ రెడ్డితో పాటు 40 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా మంచూరు సూర్యనారాయణ రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పారదర్శక పాలన అందించడంతో పాటు గ్రామాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. పార్టీలో చేరే ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు, ప్రాధాన్యం కల్పిస్తామని పేర్కొన్నారు. పార్టీలో చేరిన కుటుంబాలు టీడీపీ బలోపేతానికి కృషి చేస్తామని, ప్రజా సేవలో ముందుండి పార్టీ విజయానికి పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## వలస కూలీలను విచారించిన స్పెషల్ బ్రాంచ్ పోలీసులు



**మదనపల్లె క్రైం, జూలై 19 ప్రభాతవార్త**

వెస్ట్ బెంగాల్ నుంచి వచ్చి మదనపల్లెలో నివాసం ఉంటున్న పశ్చిమ బెంగాల్ చెందిన వలస కూలీలను అన్నమయ్య జిల్లా స్పెషల్ బ్రాంచ్ పోలీసులు విచారిస్తున్నారు. సర్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అనుమానిత వ్యక్తుల వివరాలు సేకరిస్తున్న పోలీసులకు, మదనపల్లెలోని సొసైటీ కాలనీలో నివాసం ఉంటున్న కొంతమంది వెస్ట్ బెంగాల్ వ్యక్తుల ఆధార్ కార్డులు సరిపోలకపోవడాన్ని గుర్తించారు. దీంతో అప్రమత్తమైన స్పెషల్ బ్రాంచ్ పోలీసులు వారి ఆచూకీ తెలుసుకున్నారు. ఈ మేరకు స్పెషల్ బ్రాంచ్ సీఐలు ఎరిసవల్లి, సదాశివలు ఆదివారం సొసైటీ కాలనీకి వెళ్లి అనుమానిత వ్యక్తులను విచారించారు. వారు ఎక్కడి నుంచి వచ్చారు, ఎంతకాలంగా ఇక్కడ ఉంటున్నారు, ఏ పనులు చేస్తున్నారు, వారి వద్ద ఉన్న గుర్తింపు కార్డుల వివరాలను సేకరించి పరిశీలించారు. ఆధార్ కార్డులోని వివరాలను సేకరిస్తున్నారు.

### రిజిస్ట్రేషన్ శాఖ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

# నేటి నుంచి రిలే నిరాహార దీక్షలు

**బద్వేలు, జులై 19, ప్రభాతవార్త**



రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖను ప్రైవేటీకరించడాన్ని, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జూలై 20 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా సామూహిక రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు బద్వేలు దస్తావేజు లేఖరులు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆదివారం బద్వేలు కార్బన్ సిఐ కి వినతిపత్రం అందించారు, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన జి.ఓ.ఎంఎస్. నెం.396ను వెంటనే రద్దు చేయాలని, ప్రజల ఆస్తులకు భద్రత కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే దస్తావేజు లేఖరుల లైసెన్సులను పునరుద్ధరించాలని, లేఖరులు, స్టాంపు వెండర్లు, డీటీపీ ఆపరేటర్లు, సహాయకుల జీవనోపాధిని కాపాడాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# విద్యామిత్ర కిట్ల పంపిణీ.



**లక్కిరెడ్డిపల్లి: జులై 19 ప్రభాత వార్త**

మండల కేంద్రంలోని ఎస్సీ (బాలికల) గురుకుల పాఠశాలలో ఈరోజు ఖిసర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్రఖి కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కెట్ యార్డ్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎండి షఫీ నాయక్ హాజరై విద్యార్థినులకు స్వయంగా కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షఫీ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థినుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని కొనియాడారు. ఈ విద్యా సంవత్సరం నుండి ఏపీ వ్యాప్తంగా బాలికల వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థినుల సౌకర్యార్థం, గతంలో అందజేసే సామాగ్రితో పాటు అదనంగా నైట్ డ్రెస్ లు, తువాలు, మరియు స్వెట్టర్లను ఖిసర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్రఖి కిట్లలో చేర్చి అందించడం జరిగిందని వివరించారు. విద్యార్థినుల అవసరాలను గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యొక్క చిత్తశుద్ధిని, గొప్పతనాన్ని,తమకు అందిన ఈ కిట్ల పట్ల విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ప్రిన్సిపాల్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వెంకట్రామరాజు, అహ్మద్ అలీ, ఎస్ ముక్తార్, మల్లి నాయుడు, పకీరయ్య, తుమ్మల మల్లికార్జున, షేక్ అమీర్ బాషా, అశోక్, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

## మంత్రికి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్, ఎస్పీ





**రాయచోటి టౌన్, జూలై 19 ప్రభాతవార్త**

రాయచోటి స్టేట్ గెస్ట్ హౌస్‌కు ఆదివారం సాయంత్రం చేరుకున్న రాష్ట్ర రోడ్డు రవాణా, మౌలిక వసతుల శాఖ మరియు జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి గారిని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా స్వాగతం పలికారు. వీరితో పాటు రాయచోటి డీఎస్పీ శ్రీ కృష్ణ మోహన్, రాయచోటి తహసీల్దార్ యామిని, ఆర్ అండ్ బి శాఖ డీఈ తదితర అధికారులు కూడా మంత్రికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి చేపడుతున్న చర్యలు, అమలు చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, ప్రజా సంక్షేమానికి సంబంధించిన అంశాలపై కలెక్టర్, ఎస్పీలతో మంత్రి కొద్దిసేపు చర్చించారు. ఈనెల 20న మదనపల్లిలో నిర్వహించనున్న 'షైనింగ్ స్టార్స్-2026' మరియు 'మై స్కూల్-మై ఫ్రైడ్' కార్యక్రమాల్లో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొననున్నారు.

## పొట్టిపాడు రోడ్డు నాణ్యతపై బహిరంగ చర్చకు సిద్ధం : మాజీ ఎమ్మెల్యే రాచమల్లు



ప్రొద్దుటూరు, జులై 19 (ప్రభాతవార్త)
పురపాలక సంఘం పరిధిలోని పొట్టిపాడు రోడ్డు నాసిరకంగా పనులు చేయడంతో పగుళ్లు ఏర్పడ్డాయని, ఆ రోడ్డు నాణ్యతపై బహిరంగ చర్చకు సిద్ధమని మాజీ ఎమ్మెల్యే వైఎస్ఆర్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి సవాల్ విసిరారు. ఆదివారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కుమారుడు కొండారెడ్డి తనపై చేసిన విమర్శలకు స్పందించాల్సిన అవసరం లేదని, అయితే ప్రజా సమస్యలపై మాత్రం ప్రశ్నిస్తూనే ఉంటానన్నారు. పొట్టి పాడు రోడ్డు నిర్మాణ నాణ్యతపై తాను లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం 700 మీటర్ల రహదారిలో 1868 పగుళ్లు (క్రాక్స్) ఏర్పడితే, నెల రోజుల్లోనే రోడ్డు తిన్న ఆ రోడ్డు నాణ్యతతో నిర్మించిందని అధికారులు సమర్థిస్తారా అని ప్రశ్నించారు. రోడ్డు నాణ్యత బాగుందని ప్రజల సమక్షంలో నిరూపిస్తే ఎమ్మెల్యే వర్గీయులను మూడేళ్ల పాటు విమర్శించనని, లేని పక్షంలో రోడ్డు సమస్యపై త్వరలోనే ప్రజలతో కలిసి నిరసన చేపడతానని తెలిపారు. వరదరాజులరెడ్డి హయాంలో గొప్ప అభివృద్ధి జరిగిందని చెబుతున్నారని, అయితే గత రెండేళ్లలో కనీసం ఒక్క అభివృద్ధి పని అయినా డీపీఆర్ సిద్ధం చేశారా అని ప్రశ్నించారు. ప్రొద్దుటూరులో నూతన కూరగాయల మార్కెట్ నిర్మాణానికి రూ.52 కోట్ల అంచనాతో పనులు చేపట్టాల్సి ఉండగా, గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్ చేసిన పనులకు సంబంధించిన బిల్లుల విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ సమయంలో సీఎంఎఫ్ఎస్ ద్వారా చెల్లింపులు జరిగినా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం తామే చెల్లించినట్లు ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. ఈ అంశంపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. రాష్ట్రంలో నిర్మిస్తున్న కంపోస్టు యార్డుల విషయంలోనూ అనేక అనుమానాలు ఉన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా భారీ అవినీతి జరుగుతోందని వాటి వివరాలను త్వరలో ప్రజల ముందు ఉంచుతానని తెలిపారు.

## పేకాటరాయుళ్లపై మెరుపు దాడి

సంబేపల్లి జులై 19 ప్రభాతవార్త
మండలం గున్నికుంట్ల పరిసర ప్రాంతాల్లో పోలీసులు, ఎస్ బి పోలీసులతో కలిసి పేకాట రాయుళ్ల పై ఆదివారం మెరుపు దాడి నిర్వహించినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. పేకాట ఆడుతున్న వారిపై దాడులు నిర్వహించి పది మందిని పట్టుకుని అరెస్ట్ చేసినట్లు తెలియజేశారు వ్యక్తులు పరారైనట్లు తెలిపారు. పట్టుబడిన వారి నుండి రూ 50180 రూపాయల నగదు 7 సెల్ ఫోన్లు 6 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుచనున్నట్లు తెలియజేశారు.

## పిజిఆర్ఎస్ ఫీడ్ బ్యాక్‌పై క్యూఆర్ కోడ్‌తో అభిప్రాయాలు సేకరణ

సంబేపల్లి జులై 19 ప్రభాతవార్త
ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా అందిస్తున్న సేవలపై ప్రజల అభిప్రాయాలను సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూ ఆర్ కోడ్ను ప్రజలు తప్పనిసరిగా వినియోగించాలని మండల అభివృద్ధి అధికారి రేవతి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ సమావేశాలకు హాజరయ్యే ప్రజలు తమ వినతులు, ఫిర్యాదులను సమర్పించిన అనంతరం అక్కడ ప్రదర్శనకు ఉంచిన పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూ ఆర్ కోడ్‌ను తమ మొబైల్ ఫోన్ ద్వారా స్కాన్ చేసి, అందించిన సేవలపై తమ విలువైన అభిప్రాయాలను నమోదు చేయాలని కోరారు. ప్రజల నుండి అందే ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మండలంలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పీజీఆర్ఎస్ సేవలపై తమ అభిప్రాయాలను నమోదు చేసి, ప్రజా సేవల మెరుగుదలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## సంకీర్తనలు ఆలాపన పోటీ



రాయచోటి జులై 19 ప్రభాతవార్త
శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి దేవస్థానము నందు సి తుమ్మల హరినాథ్ ఆకాశవాణి గాయకులు ఆర్గనైజర్ వారి ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనలు ఆలాపన పోటీలలో కర్నూలు, చిత్తూరు, అనంతపురం, సత్యసాయి జిల్లాల నుండి పాల్గొన్న కళాకారులకు ప్రోత్సాహక కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ ప్రోగ్రాం లో పాల్గొన కళాకారులకు మెమెంటోలు , ప్రశంసా పత్రము, మొదటి బహుమతి, ద్వితీయ బహుమతి, తృతీయ బహుమతులు ఆలయ చైర్మెన్ తిరుమల మనోజ్ కుమార్, మరియు పాలకమండలి సభ్యులు మరియు ఆలయ సహాయ కమీషనర్ కార్యనిర్వాహణాధికారి డి.వి. రమణారెడ్డి ప్రశంసా పత్రం అందజేశారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం




గాలివీడు, జూలై 19. ప్రభాతవార్త.
చింతంరెడ్డి వెంకట శివారెడ్డి వారి ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి, నెల్లూరు వారి సహకారంతో గాలివీడు మండలంలోని నూలివి డు కేశవ్ మోడల్ స్కూల్ ఆవరణలో ఆదివారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన నేత్ర వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా సలహాలు అందించనున్నారు. శుక్లాలు (క్యాటరాక్ట్), రెటినా, కళ్లద్దాల సమస్యలు, గ్లకోమా, కార్నియా, కంటి పొడిబారడం, కంటి అలర్జీలు, డయాబెటిక్ రెటినోపతి తదితర కంటి సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించబడతాయి. కంటి ఆపరేషన్ అవసరమైన వారికి పుష్పగిరి కంటి ఆసుపత్రికి ఉచిత రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు, ఆపరేషన్, భోజనం, మందులు, లెన్స్‌లు మరియు ఒకరి సహాయకుడికి అవసరమైన అన్ని సేవలను పూర్తిగా ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

## క్రికెట్ టోర్నమెంట్ పోటీలో విజేతకు నగదు

సిద్దవటం జులై 19 ప్రభాతవార్త
క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ పోటీల్లో మొదటి బహుమతి విజేతకు ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకట సుబ్బయ్య రూ. 50 వేలు నగదును అందజేశారు. సిద్దవటం మండలంలోని మాధవరం1 గ్రామంలో ఆదివారం చమర్తి జగన్మోహన్ రాజు మండల స్థాయి క్రికెట్ ఫైనల్ పోటీలు జరిగాయి. ఫైనల్ పోటీలో పేరయ్యగారి పల్లి టీం కు మాధవరం టీంల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ ఉత్కంఠ భరితంగా సాగింది. ఈ పోటీల్లో పేరయ్యగారి పల్లి టీం మొదటి మొదటి బహుమతిని కైవసం చేసుకుంది. మొదటి బహుమతి విజేతకు కుప్పాల వెంకట సుబ్బయ్య రూ 50 వేలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా కుప్పాల వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ యువత క్రిడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. యువతకు చదువుతో పాటుగా క్రీడలు కూడా అవసరమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ వెంకటేశ్వర్లు, సిద్దవటం టీడీపీ మండల అధ్యక్షులు రాజశేఖర్ యాదవ్ సిద్ధవటం మాజీ సర్పంచ్ భవనాసి ఓబులయ్య, ఏఎంసి డైరెక్టర్ కృష్ణయ్య యాదవ్ క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ



పీలేరు జూలై 19 ప్రభాతవార్త :
ప్రభుత్వం ఆధ్వర్యంలో పీలేరులోని మదనపల్లి రోడ్డు దర్గా ఎదురుగా ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం కళాశాల విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి, ఏఎంసి డైరెక్టర్ కలప రవి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నోట్ బుక్స్, స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో పీలేరు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఎస్. కృష్ణ జనసేన కార్యకర్త మహేశ్ పాల్గొన్నారు. వసతి గృహ సంక్షేమ అధికారులు మాధవి, రమాదేవి వసతి గృహ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, అందరూ చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కలప రవి విద్యార్థులకు సూచించారు.

## ఆదివారం ప్రత్యేక తరగతులు నిర్వహించడం తగదు

పీలేరు జూలై 19 ప్రభాతవార్త:



ఆదివారం పీలేరు శ్రీ చైతన్య పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారనే సమాచారంతో NSUI రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ, జనసేన విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు బాటసారి, NSUI జిల్లా అధ్యక్షులు సాయి సంపత్ కుమార్ పాఠశాలను సందర్శించి ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు. ప్రభుత్వ సెలవు రోజున ప్రత్యేక తరగతులు నిర్వహించడం సరికాదని, తరగతులను నిలిపివేయాలని సూచించారు. దీనికి స్పందించిన ప్రిన్సిపాల్ తరగతులను నిలిపివేసి విద్యార్థులను ఇళ్లకు పంపించారు. భవిష్యత్తులో ప్రభుత్వ సెలవు దినాల్లో ఎలాంటి విద్యాసంస్థలు ప్రత్యేక తరగతులు నిర్వహించకుండా పటిష్టమైన పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. విద్యను వ్యాపారంగా కాకుండా సేవాభావంతో అందించాలని, విద్యార్థుల సంక్షేమం, తల్లిదండ్రుల ప్రయోజనాలు, విద్యా వ్యవస్థలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని నాయకులు పేర్కొన్నారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా విజయభాస్కర్‌రెడ్డి



పీలేరు జూలై 19 ప్రభాతవార్త:
లయన్స్ క్లబ్ ఆఫ్ పీలేరు నూతన కార్యవర్గం (2026-2027) ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం పీలేరు లయన్స్ భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లయన్ చంద్ర హెచ్. రెడ్డి, శిలీరినీ, గత జిల్లా గవర్నర్ (317ని) ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి లయన్ బి.ఆర్. నాగ బాలాజీ, అధ్యక్షుడు, అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 2026-2027 సంవత్సరానికి లయన్ సి. విజయ భాస్కర్ రెడ్డి అధ్యక్షుడిగా, లయన్ సి. సురేంద్ర రెడ్డి కార్యదర్శిగా, లయన్ పి.వి. రమణ కోశాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. సామాజిక సేవే లక్ష్యంగా పనిచేస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ పీలేరు ఆధ్వర్యంలో రాబోయే సంవత్సరంలో నేత్ర వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, విద్యా మరియు ఆరోగ్య సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## పేకాటరాయుల్లపై మెరుపు దాడి

రామసముద్రం జులై 19 ప్రభాతవార్త



మండల కేంద్రంలోని శీతరగాని పల్లె సమీపంలోని చెట్టు కింద పేకాట ఆడుతున్న సమాచారం మేరకు ఎస్సై హృషి కేశవ రెడ్డి సిబ్బందితో కలిసి రైడ్ చేయగా పేకాట ఆడుతున్న ఏడుగురి ఆడుతుండగా వీరి నుండి 11,200 రూపాయలు, 4 సెల్ ఫోన్స్ ను స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై హృషికేశవ రెడ్డి తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదన్నారు.

## నీటి సమస్యను తీర్చిన అధికారులు

తంబళ్లపల్లె జూలై 19 ప్రభాతవార్త :
నాలుగు గ్రామాల్లో తీవ్ర తాగునీటి సమస్య ఏర్పడగా స్థానిక టిడిపి మండల అధ్యక్షుడు రెడ్డెప్ప రెడ్డి, పురుషోత్తం, వీరాంజనేయులు సమస్యను ఆర్డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆర్డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్ రెడ్డి యుద్ధ ప్రాతిపదికన స్పందించి వెంటనే ఆ గ్రామాలలో తాగునీటి కోసం ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని ఆర్డబ్ల్యూఎస్ ఎఈఈ వినోద్ కుమార్ ను ఆదేశించారు. ఆదివారం తంబళ్లపల్లె పంచాయతీలోని ఇట్నేనివారి పల్లి, సాయిబాబా కాలనీ, పరసతోపు పంచాయతీ కురువపల్లి, పెండేరివారి పల్లెలకు వాటర్ ట్యాంకు ల ద్వారా తాగునీటి సరఫరా ఏర్పాటు చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించిన ఆర్డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్ రెడ్డి, ఏఈఈ వినోద్ కుమార్ లను టిడిపి నాయకులు, నాలుగు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



## ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

### పలువురికి స్వల్ప గాయాలు

ముద్దనూరు, జూలై 19 (ప్రభాతవార్త):
మండలంలోని చెన్నారెడ్డిపల్లె గ్రామ సమీపంలో కడప-తాడిపత్రి జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రాయదుర్గం నుంచి కడప వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు అకస్మాత్తుగా గొర్రెల మంద రోడ్డుపైకి రావడంతో బస్సు డ్రైవర్ అప్రమత్తమై బ్రేక్ వేశారు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ బస్సు వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న పలువురికి స్వల్ప గాయాలు కాగా, వారిలో ఐదుగురిని 108 అంబులెన్స్ ద్వారా జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు ప్రయాణికులు ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలపై పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఈ ప్రమాదం కారణంగా కొంతసేపు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా, ఎస్సై మధుసూదన్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను సక్రమంగా నిర్వహించి పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకు వచ్చారు.

## ఎరువుల సరఫరాకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

### జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ

మదనపల్లె, జులై 19 ప్రభాతవార్త :
ఎరువుల సరఫరాకు జిల్లా కేంద్రంలో కంట్రోల్‌రూమ్, కాల్‌సెంటర్ ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఏపి ఏయిమ్స్ యాప్ ద్వారా యూరియా,డీఏపి ఎరువులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో రైతులకు ఎక్కడ ఎరువుల కొరత లేదని తెలిపారు. యూరియా 8,974మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉండగా ఇప్పటి వరకు 4.003 మెట్రిక్ టన్నులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అదే విధంగా డిఏపి 1,934మెట్రిల్ టన్నులు అందుబాటులో ఉండగా ఇప్పటి వరకు 1,321 మెట్రిక్ టన్నులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. రైతులకు ఆగస్టు చివరి వరకు సరిపడే ఎరువులు నిల్వ ఉన్నాయన్నారు. ఈ యాప్ ద్వారా ఎరువులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో ఎరువులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎరువులకు సంబంధించి జిల్లాలో ఎలాంటి సమస్య లేదని తెలిపారు.

## నేడు మదనపల్లె కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

మదనపల్లె, జూలై 19 ప్రభాతవార్త :
మదనపల్లె కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్) నిర్వహించనున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజలు ప్రజాసమస్యలపై పిజిఆర్ఎస్‌లో ఆధారాలతో కూడిన అర్జీలను సమర్పించాలని కోరారు. అర్జీలపై సమాచారం కొరకు మీ కోసం కాల్‌సెంటర్ నెంబర్ 1100లను సంప్రదించాలన్నారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్‌లలో అధికారులకు కూడా ఇవ్వవచ్చని సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేధిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

### ఐదుగురు ఎమ్మెల్యేలు మారినా

## అసంపూర్తిగానే షాదీమహల్

### కాంగ్రెస్ పార్టీ మైనార్టీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్‌కె.బాష

మదనపల్లె, జూలై 19 ప్రభాతవార్త :



ఐదుగురు ఎమ్మెల్యేలు మారినా పట్టణంలోని ఇందిరానగర్ వద్ద ఉన్న షాదీమహల్ నిర్మాణ పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు ఎస్‌కె.బాష తెలిపారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్న హాయంలో మదనపల్లెలో మొట్టమొదటిగా షాదీమహల్ నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే సాగర్‌రెడ్డి హయాంలో భూమిపూజ చేశారన్నారు. ఇప్పటికి నియోజకవర్గంలో ఐదుగురు ఎమ్మెల్యేల పదవులు పూర్తి అయిన కూడా షాదీమహల్ నిర్మాణ పనులు అసంపూర్తిగానే ఆగిపోయాయన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో మైనార్టీ ఎమ్మెల్యేగా ఉన్న షాజహాన్‌బాషా హాయంలోనైనా అసంపూర్తిగా ఉన్న షాదీమహాల్‌ను పూర్తి చేయాలని కోరారు. జిల్లా కేంద్రమైన మదనపల్లెలో షాదీమహాల్ నిర్మాణ పనులు పూర్తి అయితే పేద మైనార్టీలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. అదే విధంగా మైనార్టీల సంక్షేమం కోసం పథకాలు ప్రవేశపెట్టాలన్నారు.

### తంబళ్ళపల్లెలో టిడిపి ఇన్‌చార్జ్

## నియామకంలో జాప్యమెందుకు...

### అయోమయంలో నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు

మదనపల్లె, జూలై 19 ప్రభాతవార్త :
తంబళ్లపల్లె నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ నాయకుని నియామకంలో జాప్యమెందుకు అంటూ కార్యకర్తలు, నాయకులు పార్టీ అధిష్టానాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇటీవల తంబళ్ళపల్లె ఇన్‌చార్జ్ నాయకుని నియామకంకు సంబంధించి తిరుపతిలోని ఓ ప్రైవేటు పంక్షన్‌హాలులో కార్యకర్తలు, మండల స్థాయి నాయకులు, బూత్‌కమిటీ కన్వీనర్లు, మాజీ మండల స్థాయి ప్రజాప్రతినిధుల అభిప్రాయ సేకరణను మంత్రులు తీసుకోవడం జరిగింది. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జ్ సత్యలు కార్యకర్తల అభిప్రాయాలను సేకరించడం జరిగింది. అప్పట్లో మంత్రుల ప్రజాభిప్రాయ సేకరణలో కొద్దిగా గొడవ సైతం చోటుచేసుకొంది. మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్, పార్టీ నుంచి సస్పెండ్‌కు గురైన దాసరిపల్లె జయచంద్రారెడ్డి వర్గీయుల మధ్య ఇన్‌చార్జ్ నియామకంపై మంత్రుల వద్ద గొడవ జరిగిన విషయం తెలిసిందే. తంబళ్ళపల్లె నియోజకవర్గంలో ఇన్‌చార్జ్ నాయకులు లేక పార్టీ కార్యకర్తలు, నాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నా ప్రయోజనం లేకపోయిందంటూ పలువురు ఆవేదన చెందుతున్నారు. త్వరలోనే స్థానిక ఎన్నికలు రానున్నాయని ఈ ఎన్నికల్లో గెలుపొందాలంటే తక్షణం తంబళ్లపల్లెకు ఇన్‌చార్జ్ నాయకున్ని నియమించాలంటూ పలువురు కోరుతున్నారు. నియోజకవర్గంలో వైకాపాను ఎదుర్కోవాలంటే పార్టీకి బలమైన నాయయున్ని నియమించాల్సి ఉంది. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి అయిన చొరవ చూపి తంబళ్ళపల్లె నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి ఇన్‌చార్జ్ నియామకానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## అన్న ప్రసాదశాలను పరిశీలించిన మఠాధిపతి

బ్రహ్మంగారిమఠం జులై 19 ప్రభాతవార్త



జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో భక్తుల సహకారంతో నిర్వహిస్తున్న అన్న ప్రసాదశాలను మఠాధిపతి వీరధర్మజ వెంకటాద్రి స్వాములవారు ఆదివారం భోజనశాలలో భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదం నాణ్యత, పరిశుభ్రతను స్వయంగా పరిశీలించారు. అక్కడ భోజనం చేస్తున్న భక్తులతో మాట్లాడి, భోజనాలు రుచికరంగా ఉన్నాయా, ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం భోజనశాల నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించిన మఠాధిపతి, నిర్వహణలో పారదర్శకతతో పాటు పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. భక్తుల సేవను అత్యున్నత బాధ్యతగా భావించి, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన అన్నప్రసాదం అందేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు.

## వసతి గృహ విద్యార్థులకు ప్రభుత్వ కిట్ల పంపిణీ



చౌడేపల్లి జూలై 19 ప్రభాతవార్త
మండల కేంద్రమైన చౌడేపల్లిలోని సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ బాలురు, బాలికల వసతి గృహ విద్యార్థులకు ఆదివారం ప్రభుత్వం తరఫున దుస్తులు, బెడ్డింగ్ సామాగ్రిని పంపిణీ చేశారు. స్థానిక ఉన్నత పాఠశాల వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ హరి రాయల్, తెలుగుదేశం పార్టీ నాయకులు సాగర్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు ఈ వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉన్నత ఆశయంతో ప్రభుత్వం ఉచితంగా దుస్తులు, క్రీడా బూట్లు (స్పోర్ట్స్ షూస్), బ్లాంకెట్లు వంటి వస్తువులను అందిస్తోందని పేర్కొన్నారు. వసతి గృహాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న ఈ వసతులను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకుని, చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ బాలురు, బాలికల వసతి గృహాల వార్డెన్లు సురేష్, దీపారాణి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## లోక కళ్యాణార్థం నేడు మహా పాదయాత్ర

బద్వేలు, జూలై 19, ప్రభాతవార్త
లోక కళ్యాణార్థం కోసం నియోజకవర్గంలోని గోపవరం మండలం వల్లెరవారిపల్లెలో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుండి పెంచలకోన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం వరకు మహా పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈ పాదయాత్ర జూలై 20, సోమవారం ఉదయం 4:00 గంటలకు వల్లెరవారిపల్లె ఆలయం నుండి ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా అదే రోజు ఉదయం 8:00 గంటలకు పి.పి.కుంట నెల్లూరు రోడ్డులోని వెంకయ్యస్వామి ఆలయం వద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మహత్తర ధార్మిక కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎలక్ట్రానిక్, ప్రింట్, డిజిటల్ మీడియా ప్రతినిధులందరూ పాల్గొని సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## ఎద్దులకొండ్రాయునికి ఆభరణాలు



వేంపల్లె జూలై 19 ప్రభాతవార్త
పవిత్ర పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం ఎద్దుల కొండ్రాయుడికి పంచలోహ ఆభరణాలను వేంపల్లె పట్టణానికి చెందిన భక్తుడు పోలేపల్లె కృష్ణారావు సతీమణి సౌజన్య స్వామివారికి సమర్పించారని ఆలయ ఈఓ సుభాష్ తెలిపారు. ఈ సందర్భంగా కడప రోడ్డులో గల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లకు 26,800/ లు విలువ చేసే మకరకంటి మరియు లక్ష్మీ కాసుల దండ కృష్ణారావు కుటుంబ సభ్యులు సత్యనారాయణ, శైలజ, పాపయ్య,పద్మలత, నగరాజ, నాగరత్నలు కలిసి ఆలయ అర్చకులు హరిప్రవీణ్,తిరుమల వేణు, ఛైర్మన్ పీవీ రమణకు అందజేశారని తెలిపారు. అనంతరం వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దేవస్థానం ఆధ్వర్యంలో దాతలను దుశ్శాలువతో ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ,చైర్మన్ మాట్లాడుతూ దాతల సహకారం మరువలేనిది అన్నారు. దాతల సహకారం ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. దాతలు కూడ ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీకీ ఉషాకిరణ్ విద్యార్థి

వేంపల్లె జూలై 19 ప్రభాతవార్త



స్థానిక ఉషాకిరణ్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి సిఎస్ మహమ్మద్ ఇంతియాజ్ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకీ ఎంపికైనట్లు కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి వెల్లడించారు. పదోతరగతి 2026 ఫలితాల్లో విద్యార్థి ఇంతియాజ్ 588 మార్కులతో ఉత్తమ కనబరిచాడు. దీంతో ఆర్జీయూకేటి యూజీ 26 శ్రీకాకుళం క్యాంపస్ కి ఎంపిక కావడం పట్ల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఉన్నత చదువులు చదివి భవిష్యత్ కి బాటలు వేయాలని, ఉన్నత స్థాయికి అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే తల్లిదండ్రుల కలలను సాకారం చేసి పాఠశాలకు గుర్తింపు తేవాలని కోరారు.

## ప్రార్థించే పెదాల కంటే సేవ చేసే చేతులు మిన్న




వేంపల్లె జూలై 19 ప్రభాతవార్త
ప్రార్థించే పెదాల కంటే సేవ చేసే చేతులు మిన్న, పరుల సేవలో పరమాత్మని సేవ అని మాజీ రాజ్యసభ సభ్యుడు డా.తులసిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక అమ్మ అనాథ వృద్ధాశ్రమం 29వ వార్షికోత్సవ వేడుకల్లో తులసిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నిర్వాహకుడు వెంకట సుబ్బయ్య కు శాలువతో ఘనంగా సత్కరించారు. మానవ సేవలో.. వృద్ధుల సేవ మరింత విశిష్టమైనదని తులసిరెడ్డి తెలిపారు. ఎటువంటి ప్రభుత్వ సహకారం లేకుండా కేవలం దాతల సహకారంతో వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్న వెంకట సుబ్బయ్య ను కొనియాడారు. సేవాతత్వం కలిగిన వారిని ప్రభుత్వం గుర్తించి తగిన ప్రోత్సాహకత అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ సిబ్బంది కుమారి, పద్మావతి, ఉషారాణి, చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, అమర్, ఉత్తన్న, రవీంద్రారెడ్డి, రమణ, నాగరాజు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆగి ఉన్న లారీ ట్యాంకులోని ఆయిల్ చోరీ

సిద్ధవటం జులై 19 ప్రభాతవార్త
కడప చెన్నై జాతీయ రహదారిలో ఆగి ఉన్న లారీ ట్యాంకులో ఆయిల్ చోరీపై సిద్దవటం ఎస్సై హారిక ఆధ్వర్యంలో పోలీసులు విచారిస్తున్నారు. సిద్ధవటం మండలంలోని మాధవరం1 పార్వతీపురం గ్రామంలో ఆదివారం తెల్లవారుఝామున ఆగి ఉన్న లారీ ట్యాంకులోని ఆయిల్ ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం లారీ డ్రైవర్ మోలాలి మాట్లాడుతూ తాడిపత్రి నుండి చెన్నైకి సిమెంట్ తీసుకెళ్తున్నామన్నారు. ప్రొద్దుటూరులో శనివారం రాత్రి లారీకి టైర్లు మార్చుకొని 10 గంటలకు బయలుదేరి కడప లోని తన బంధువులతో మాట్లాడి మాధవరం1 గ్రామానికి ఆదివారం తెల్లవారుఝామున వచ్చానన్నారు. లారీ రోడ్డు పక్కన నిలుపుదల చేసి నిద్రపోయానని లారీ ట్యాంకును పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు 390 లీటర్ల డీజిల్ చోరీకి పాల్పడ్డారన్నారు. చోరీకి గురైన డీజిల్ విలువ సుమారు రూ. 40 వేలు అవుతుందని డయల్ 100 కు ఫిర్యాదు చేశానన్నారు. ఒంటిమిట్ట సీఐ వెంకటేశ్వర్లు, సిద్దవటం ఎస్సై హారిక లు సంఘటన స్థలానికి చేరుకొని లారీ ట్యాంకులోని ఆయిల్ చోరీ ఘటనపై విచారిస్తున్నారు.

# శ్రీ బ్రహ్మర్షి పత్రీజీ బయోపిక్ ప్రదర్శన

స్థానిక సినీ హబ్ లో శ్రీ బ్రహ్మర్షి పత్రీజీ చిత్ర ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచానికి ధ్యానం పరిచయం చేసిన బ్రహ్మర్షి పత్రీజీ ఏ విధంగా ద్యాన కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల్లోకి ఏ విధంగా తీసుకపోయాడో మనకు కళ్ళకు కట్టినట్లు ప్రదర్శించడం, ఈ చిత్రం ద్వారా ప్రజల్లోకి పూర్తిగా వెళ్లడం తమకు ఆనందదాయకమన్నారు. పత్రీజీ తన కుటుంబన్ని కాదని నిత్యం వివిధ ప్రాంతాల్లో ప్రదేశాల్లో ధ్యాన సముపార్జన ద్వారా సత్యశోధన చేయడం చాలా గొప్ప విషయం అన్నారు. చిత్తశుద్ధితో పని చేస్తే ఒక వ్యక్తి ఒక మహాశక్తి ఎలా అవుతాడో ఈ చిత్ర ప్రదర్శనతో నిదర్శనమైనదన్నారు. మహత్తరమైన ఆశయంతో ఆయన ధ్యానజగత్తు ఏర్పాటుకు పడుతున్న తాపత్రానికి మనమందరం కూడా తోడై ప్రజల్లోకి మరింతగా తీసుకపోవాలన్నారు. అక్టోబర్ 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ప్రొద్దుటూరు పట్టణంలో ధ్యాన దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ది ప్రొద్దుటూరు స్పిరిచువల్ ట్రస్ట్ సతీష్ కుమార్, ప్రెసిడెంట్ ప్రత్యూష, వైస్ ప్రెసిడెంట్ సతీష్ కుమార్, జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ, ట్రెజరర్ అనిల్ కుమార్, సభ్యులు సృజనాదేవి, జయలక్ష్మి, హరికిషన్, గురుప్రసాద్, పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో

# పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తం

ప్రొద్దుటూరు, జులై 19 ప్రభాతవార్త



కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని, పారిశుద్ధ్య వ్యవస్థపై తాను చర్చకు సిద్ధమని మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర స్వచ్ఛంద్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ చేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. కూటమి పాలనలో రెండేళ్లలో ఏపీ స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా, ప్రొద్దుటూరు స్వచ్ఛ పట్టణంగా మారిందని చెప్పడం వాస్తవాలకు విరుద్ధమని అన్నారు. కంపోస్టు యార్డులు ఏర్పాటు చేస్తేనే పట్టణం పరిశుభ్రంగా మారదని, ప్రజల అభిప్రాయం తీసుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. పారిశుద్ధ్యం బాగుందని ప్రజలు చెబితే పట్టాభి ఇంట్లో మూడేళ్లు పారిశుధ్య పనులు చేసేందుకు సిద్ధమని, లేదంటే తన ఇంట్లో అదే పని చేయడానికి పట్టాభి సిద్ధమా అని సవాల్ విసిరారు. ప్రతి సమావేశంలో, ప్రతిరోజూ జగన్ నామస్మరణ చేయడం టీడీపీ నాయకుల అలవాటుగా మారిందని విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో చెత్త సేకరణకు ప్రత్యేక సిబ్బంది, వాహనాలు ఏర్పాటు చేసి రోజుకు ఒక్క రూపాయి తీసుకుని పారిశుధ్యాన్ని మెరుగుపరిచామని, ఇప్పుడు చెత్త పన్ను ఎత్తివేశామని చెబుతూ పరోక్షంగా ప్రజలపైనే భారం మోపుతున్నారని ఆరోపించారు. వైఎస్సార్ మరణం తర్వాత ఓదార్పు యాత్ర చేపట్టి ప్రజలకు దగ్గరైన జగన్, ప్రజా సంకల్ప యాత్ర ద్వారా అధికారంలోకి వచ్చి సంక్షేమ పాలన అందించారని అన్నారు. ప్రస్తుతం ప్రజల తరఫున పోరాడుతున్న నాయకుడిగా జగన్ నిలిచారని పేర్కొన్నారు. కడప జిల్లా ఎప్పటికీ వైఎస్సార్ కుటుంబానికి అండగా ఉంటుందని, గత ఎన్నికల్లో కూటమి పార్టీలన్నీ కలిసి పోటీ చేసినా వచ్చిన ఓట్లకు సమానంగా జగన్‌కు ఒంటరిగా భారీగా ఓట్లు వచ్చాయని తెలిపారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కడప జిల్లాలో బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు, బుగ్గవంక రక్షణ గోడ, సున్నపురాళ్లపల్లె స్టీల్ ప్లాంట్‌కు చర్యలు, కొప్పర్తి పారిశ్రామిక వాడ అభివృద్ధి, కడప విమానాశ్రయ విస్తరణ, పలు పరిశ్రమలు, వైద్య విద్యాసంస్థలు ఏర్పాటు చేశామని వివరించారు. అమరావతి, రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని రాచమల్లు తెలిపారు. ప్రజలకు వాస్తవాలు తెలుసునని, అబద్ధపు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టలేరని అన్నారు.

# ప్రెస్ క్లబ్ ప్రయోజనాలే ప్రాధాన్యత

## జర్నలిస్టుల సంక్షేమం కోసం ఐక్యంగా కృషి



పులివెందుల జులై 19 , ప్రభాతవార్త :

వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్ పులివెందుల నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం పట్టణంలోని సత్రం బడిలో నిర్వహించారు. నియోజకవర్గంలోని జర్నలిస్టులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖుల సమక్షంలో నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా వెన్నపూస జయరామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా దాసరి కార్తీక్, క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా గజ్జల వెంకట రమణారెడ్డి, సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేస్తామని, ఎటువంటి స్వార్థ ప్రయోజనాలకు తావులేకుండా నిస్వార్థంగా పనిచేస్తూ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

# ఉమ్రాసాబ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



కలికిరి, జులై 19, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని మసీదు వీధిలో నివాసం ఉంటున్న తెదేపా సీనియర్ నేత ఎస్. ఉమ్రాసాబ్(77) కుటుంబాన్ని ఆదివారం టీడీపీ నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. ఉమ్రాసాబ్ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. ఉమ్రాసాబ్ నల్లారి కుటుంబానికి ముఖ్య అనుచరుడు మృతి సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఉమ్రా సాబ్ ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఉమ్రాసాబ్ కుటుంబానికి నల్లారి కుటుంబం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కలికిరి మేజర్ పంచాయతీ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ రెడ్డివారి యోగేష్‌రెడ్డి, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కత్తెర ఒక్కటే కానీ..



**పరికరాలతో పని తేలికయ్యే మాట నిజమే..** కానీ ప్రతి పనికీ ఒక పరికరాన్ని కొనలేం కదా! ఇదిగో ఈ మల్టీ ఫంక్షనల్ కత్తెర ఒకటి మీ దగ్గర ఉంటే ఐదారు పనులు సులభంగా చేసుకోవచ్చు. రెండు వైపులా పదును ఉండే ఈ కత్తెరతో చికెన్‌ని కావాల్సిన పరిమాణంలో ముక్కలు చేసుకోవచ్చు. చేపపొలుసులు తీసుకోవచ్చు. కాయగూర తొక్కలని వలిచే పీలర్‌గానూ ఉపయోగపడుతుంది. వాల్‌నట్స్ వంటి కఠినమైన గింజలని పగలకొట్టడం తేలిక. వెనుక భాగాన్ని బాటిల్ ఓపెనర్‌గా మలుచు కోవచ్చు. ఎక్కడ పెట్టాం అని వెతుక్కోవాల్సిన అవసరం లేకుండా ఫ్రిజ్‌కి తగిలించుకోవచ్చు.

# సోషల్ మీడియా పోస్టు వ్యాజ్యాలపై తెలంగాణ హైకోర్టు మార్గదర్శకాలను సమర్థించిన సుప్రీం కోర్టు

బద్వేలు లీగల్, జూలై 19 ప్రభాతవార్త:

సోషల్ మీడియా పోస్టుల వలన తలెత్తే కేసుల్లో ఎఫ్ఐఆర్‌ల నమోదును నియంత్రించడానికి తెలంగాణ హైకోర్టు రూపొందించిన మార్గదర్శకాలను సుప్రీం కోర్టు సమర్థించింది. తీవ్రమైన అభ్యంతరకరమైన లేదా విమర్శనాత్మక రాజకీయ ప్రసంగాలపై యాంత్రికంగా ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయవద్దని జస్టిస్ జె.బి.పార్థివాలా, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడా ధర్మాసనం పోలీసులను ఆదేశించింది. సోషల్ మీడియా పోస్టులలో శతృత్వాన్ని ప్రోత్సహించడం ప్రజా శాంతికి ముప్పు లేదా దేశ ద్రోహం వంటివి ఉన్నట్లు ప్రాథమికంగా కేసు ఉంటేనే వాటిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని హైకోర్టు తేల్చి చెప్పిన విషయాన్ని సుప్రీం కోర్టు ప్రస్తావించింది. ఈ మేరకు తెలంగాణ హైకోర్టు మూడు ఎఫ్ఐఆర్‌లను రద్దు చేయడాన్ని భారత అత్యున్నత న్యాయ స్థానం సమర్థించింది. సోషల్ మీడియా పోస్టుల నుండి ఉత్పన్నమయ్యే క్రిమినల్ కేసులను పరిష్కరించేటపుడు పోలీసులు మరియు మేజిస్ట్రేట్ల కోసం వివరణాత్మక మార్గదర్శకాలను నిర్దేశించిన హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ రాష్ట్రం దాఖలు చేసిన పిటీషన్లను సుప్రీం కోర్టు ధర్మాసనం కొట్టివేసింది. హైకోర్టు ఇచ్చిన తీర్పును రూపొందించిన మార్గదర్శకాలతో సహా సమగ్రంగా పరిశీలించిన తరువాత వాటిలో జోక్యం చేసుకోవడానికి న్యాయ స్థానం నిరాకరించింది. "మేము 29వ పేరాను క్షుణ్ణంగా పరిశీలించాము, హైకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలతో సహా హైకోర్టు ఇచ్చిన తీర్పు, జారీ చేసిన ఉత్తర్వులలో జోక్యం చేసుకోకూడదని మేము భావిస్తున్నాము." అని పేర్కొన్నది. ప్రస్తుత కేసులోని ఓ పార్టీని విమర్శిస్తూ ఎక్స్ లో పోస్టులు పెట్టిన ఓ వ్యక్తిపై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్-61(2) లతో కలిపి సెక్షన్-192, 353(1)(బి), 352 మరియు 356 ల క్రింద నమోదు చేసిన మూడు ఎఫ్ఐఆర్‌లను తెలంగాణ హైకోర్టు రద్దు చేసింది. ఆ పోస్టులు విమర్శనాత్మకంగా ఉన్నప్పటికీ చట్టబద్ధమైన రాజకీయ భావ ప్రకటనా పరిధి లోనికి వస్తాయని, ఫిర్యాదులలో నిర్దిష్ట వివరాలు, కేసు వేయడానికి అర్హత లేవని తెలంగాణ హైకోర్టు అభిప్రాయపడింది. క్రిమినల్ విచారణలను కొనసాగించడం చట్ట పరమైన ప్రక్రియను దుర్వినియోగం చేయడమే అవుతుందని, ఆ ప్రాతిపదికన సోషల్ మీడియా పోస్టుల నుండి ఉత్పన్నమయ్యే కేసులలో క్రిమినల్ చట్టాన్ని యాంత్రికంగా ఉపయోగించడాన్ని నిరోధించాలని కూడా ఆదేశిస్తూ మార్గదర్శకాలను రూపొందించింది. సోషల్ మీడియా పోస్టులు ఆధారంగా ప్రారంభించిన విచారణలను, ముఖ్యంగా ఎఫ్ఐఆర్‌ల నమోదు దశలోనే పోలీసు అధికారులు మరియు జుడీషియల్ మేజిస్ట్రేట్ల కోసం హైకోర్టు కార్యాచరణ మార్గదర్శకాలను జారీ చేసింది. పరువు నష్టం లేదా ఇలాంటి నేరాలకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసే ముందు పోలీసులు లోకస్ స్టాండీని ధృవీకరించుకోవాలని, చట్టబద్ధమైన అంశాలు ఉన్నాయో, లేవో నిర్ధారించడానికి కాగ్నిజబుల్ కేసులలో ప్రాథమిక విచారణ జరపాలని ఈ మార్గదర్శకాలలో ఆదేశాలున్నాయి. ఇంకా శతృత్వాన్ని ప్రోత్సహించడం, ఉద్దేశ్యపూర్వక అవమానం, ప్రజా అల్లర్లు, శాంతి భద్రతలకు ముప్పు లేదా దేశ ద్రోహానికి సంబంధించిన కేసులలో పోలీసులు ఉన్నత ప్రమాణాన్ని పాటించాలని కూడా హైకోర్టు ఆదేశించింది. హింస, ద్వేషం లేదా ప్రజా అశాంతిని ప్రేరేపించడం గురించి వెల్లడించే ప్రాథమిక సాక్ష్యం ఉంటే తప్ప ఏలాంటి కేసును నమోదు చేయకూడదని నొక్కి చెప్పింది. కఠినమైన అభ్యంతరకరమైన లేదా విమర్శనాత్మక రాజకీయ ప్రసంగాలకు సంబంధించిన కేసులను, ఆ ప్రసంగం హింసకు ప్రేరేపణగా మారినా లేదా శాంతి భద్రతలకు తక్షణ ముప్పు కలిగిస్తే కానీ తప్ప యాంత్రికంగా నమోదు చేయకూడదని హైకోర్టు ఆదేశించింది. అర్నేష్ కుమార్ ఎదిరి స్టేట్ ఆఫ్ బిహార్ కేసులో నిర్దేశించిన అరెస్టు మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. సున్నితమైన కేసుల్లో పబ్లిక్ ప్రాసిక్యూటర్ నుండి ముందస్తు న్యాయ సలహా తీసుకోవాలని, బిఎన్ఎస్ఎస్ సెక్షన్-176(1) ల క్రింద పనికిరాని లేదా రాజకీయ ప్రేరేపితంగా దాఖలయ్యే పిర్యాదులను మూసివేయాలని కూడా నిర్దేశించింది. రాష్ట్రం తరుపున సుప్రీం కోర్టు ముందు సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రా హాజరయ్యారు. ఎఫ్ఐఆర్‌లను రద్దు చేయడానికి గల యోగ్యతలపై ఆయన ఏలాంటి వాదనలను చేయలేదు. అయితే హైకోర్టు తీర్పులో నిర్దేశించిన విస్తృత మార్గదర్శకాలపై ఆయన అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ఆ మార్గదర్శకాలు ఒకదానికొకటి వైవిధ్యంగా ఉన్నాయని, వాటిని సుప్రీం కోర్టు సరిదిద్దాల్సిన అవసరం ఉన్నదని వాదించగా హైకోర్టు తీర్పులో లేదా అది జారీ చేసిన మార్గదర్శకాలలో జోక్యం చేసుకోవడానికి తాము సుముఖంగా లేమని సుప్రీం కోర్టు తెలిపింది. ఈ వ్యాఖ్యలతో తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటీషన్‌లను కొట్టివేస్తూ దిగువ తెలిపిన విధంగా హైకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను సుప్రీం కోర్టు సమర్థిస్తూ సోషల్ మీడియాలో తీవ్రమైన రాజకీయ పోస్టులపై యాంత్రికంగా ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయవద్దంటూ తీర్పునిచ్చింది. మార్గదర్శకాలు: 1) లోకస్ స్టాండీ ధృవీకరణ: పరువు నష్టం లేదా ఇలాంటి నేరాలకు సంబంధించి ఏదైనా ఎఫ్ఐఆర్ నమోదు చేసే ముందు పిర్యాదుదారు చట్ట ప్రకారం "బాధితుడు"గా అర్హత కలిగి ఉన్నాడో? లేదో? పోలీసులు ధృవీకరించుకోవాలి. సంబంధం లేని థర్డ్ పార్టీ ఫిర్యాదులు కాగ్నిజబుల్ నేరానికి సంబంధించినవి అయితేనే తప్ప, మిగతావి చెల్లుబాటు కావు. 2) కాగ్నిజబుల్ నేరాలతో ప్రాథమిక విచారణ: ఒక నివేదిక లేదా ఫిర్యాదు కాగ్నిజబుల్ నేరాన్ని వెల్లడిస్తే, పోలీసులు నేరం నమోదు చేయడానికి ముందు ఆరోపిత నేరానికి సంబంధించిన చట్ట బద్ధమైన అంశాలు ప్రాథమికంగా ఉన్నాయో? లేదో? నిర్ధారించడానికి ప్రాథమిక విచారణ జరపాలి. 3) మీడియా పోస్టులు లేదా ప్రసంగ సంబంధిత నేరాలకు అధిక పరిమితి: హింస, ద్వేషం లేదా ప్రజా అశాంతిని ప్రేరేపించే ప్రాథమిక ఆధారాలు ఉంటేనే తప్ప, శతృత్వాన్ని ప్రోత్సహించడం, ఉద్దేశ్య పూర్వక అవమానం, దుశ్చర్య, శాంతి భద్రతలకు ముప్పు లేదా దేశ ద్రోహం వంటి కేసులను నమోదు చేయకూడదు. కేదార్‌నాథ్ సింగ్ ఎదిరి స్టేట్ ఆఫ్ బీహార్ శ్రేయా సింఘాల్ ఎదిరి యూనియన్ ఆఫ్ ఇండియా కేసుల్లో నిర్దేశించిన సూత్రాలకు అనుగుణంగా ఈ పరిమితిని వర్తింపచేయాలి; 4) రాజకీయ ప్రసంగం లేదా పోస్టుకు రక్షణ: కఠినమైన, అభ్యంతరకరమైన లేదా విమర్శనాత్మక రాజకీయ ప్రసంగాలకు సంబంధించి పోలీసులు యాంత్రికంగా కేసులు నమోదు చేయకూడదు, ఆ ప్రసంగం హింసను ప్రేరేపించినపుడు లేదా ప్రజా శాంతికి తక్షణ ముప్పు కలిగించినపుడు మాత్రమే క్రిమినల్ చట్టాన్ని ప్రయోగించవచ్చు. రాజ్యాంగంలోని ఆర్టికల్-19(1)(ఎ) ల ప్రకారం స్వేచ్ఛాయుత రాజకీయ విమర్శలకు ఉన్న రాజ్యాంగ రక్షణలను ఖచ్చితంగా అమలు చేయాలి; 5) పరువు నష్టం ఒక నాన్ కాగ్నిజబుల్ నేరము; పరువు నష్టం ఒక నాన్ కాగ్నిజబుల్ నేరంగా వర్గీకరించబడినందున పోలీసులు అటువంటి విషయాలలో నేరుగా ఎఫ్ఐఆర్ లేదా కేసును నమోదు చేయలేరు. ఫిర్యాదుదారుకు సంబంధిత మేజిస్ట్రేట్‌ను సంప్రదించుమని ఆదేశించాలి. బిఎన్ఎస్ఎస్ సెక్షన్-174(2) క్రింద మేజిస్ట్రేట్ నిర్దిష్ట ఆదేశం తరువాత మాత్రమే పోలీసు చర్య ఉంటుంది; 6) అరెస్టు మార్గదర్శకాలకు కట్టుబడి ఉండడం: అన్ని కేసులలో పోలీసులు అర్నేష్ కుమార్ ఎదిరి స్టేట్ ఆఫ్ బీహార్ (2014) కేసులో నిర్దేశించిన సూత్రాలను ఖచ్చితంగా పాటించాలి. స్వీయ చొరవతో లేదా యాంత్రిక అరెస్టులు అనుమతించబడవు. క్రిమినల్ ప్రక్రియను అమలు చేయడంలో అనుపాత సూత్రాన్ని పాటించారు; 7) సున్నితమైన కేసులలో ముందస్తు న్యాయ పరిశీలన, రాజకీయ ప్రసంగం లేదా పోస్టు లేదా ఇతర సున్నితమైన భావ ప్రకటనా రూపాలకు సంబంధించిన విషయాలలో ప్రతిపాదిత చర్య చట్టబద్ధంగా నిలబడేలా చూసుకోవడానికి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ముందు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నుండి ముందస్తు న్యాయ సలహా పొందాలి; 8) పనికమాలిన లేదా దురుద్దేశ్య పూరిత ఫిర్యాదులు: ఒక ఫిర్యాదు పనికిమాలినదిగా, వేధించేదిగా లేదా రాజకీయ దురుద్దేశ్యంతో కూడుకున్నదిగా తేలితే ధర్యాప్తుకు తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ పోలీసులు బిఎన్ఎస్ఎస్ సెక్షన్-176(1) క్రింద ఆ విషయాన్ని మూసివేయాలి. అని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను సమర్థిస్తూ సుప్రీం కోర్టు ఈ తీర్పును వెలువరించింది. (శీర్షిక: తెలంగాణ రాష్ట్రం ఎదిరి నల్ల బాలు ఎ.దుర్గం శశిధర్ గౌడ్ మరియు ఇతరులు కేసు నెం.స్పెషల్ లీవ్ పిటీషన్ (క్రిమినల్) డైరీ నెం.71178/2025)

## పేదలపై టీఎన్ఎస్ఎఫ్ తిరుమలేష్

# దౌర్జన్యాలు చర్యలు తీసుకోవాలి



బద్వేలు, జూలై 19, ప్రభాతవార్త

20 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదలపై అధికార పార్టీ పేరుతో దాడులు చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ తిరుమలేష్, అతని అనుచరులపై తక్షణ చర్యలు తీసుకోవాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ డిమాండ్ చేసింది. ఆదివారం బాధితులతో కలిసి పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్.చంద్రశేఖర్ బద్వేల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ మంచూరి సూర్యనారాయణ రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గౌరీశంకర్ నగర్‌లో 2003 నుండి నివాసం ఉంటున్న పిన్నం వెంకటయ్య కుటుంబంపై తిరుమలేష్ రెండు కార్లలో మారణాయుధాలతో వచ్చి దాడి చేసి ప్రహరీ గోడ పగలగొట్టేందుకు ప్రయత్నించారని చంద్రశేఖర్ ఆరోపించారు. 2007లో అప్పటి కలెక్టర్ ఎం.టి.కృష్ణబాబు ఆదేశాలతో 5000 మందికి ఇండ్ల పట్టాలు ఇచ్చినప్పటికీ, ఇప్పుడు ఇతర ప్రాంతాల వారు పాత పట్టాలు చూపించి పేదలను బెదిరిస్తున్నారని తెలిపారు. "పేదలను లక్షాధికారులుగా చేస్తామని సీఎం ప్రకటనలు చేస్తుంటే, ఇక్కడ మాత్రం పార్టీ పలుకుబడితో రెవెన్యూ, పోలీస్ వ్యవస్థలను లొంగదీసుకుని పేదల ఆస్తులు లాక్కుంటున్నారు" అని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు కె.జకరయ్య, నియోజకవర్గ కమిటీ సభ్యులు కె.బాబు, రామరాజు, సంజీవరాయుడు, జయరామరాజు, నారాయణ, గంటా మహబూబ్ బాషా తదితరులు, గౌరీశంకర్ నగర్ ప్రజలు పాల్గొన్నారు.

# తల్లిపై కొడుకు కోడలు దాడి

రాజుపాలెం, జులై 19, ప్రభాతవార్త.

మండల పరిధిలోని వెలవలి గ్రామంలో ఆదివారం పొలంలో నీళ్ల కట్టుకునే విషయమై తల్లి పైన కొడుకు కోడలు దాడి చేసిన విషయమై ఎస్సై ప్రణయ్ కుమార్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు తెలిపారు. వివరాల్లోకి వెళితే కందుకూరు బీబీ అనే మహిళ పొలంలో మోటర్ ద్వారా పొలంనకు నీరును కట్టుకునే సమయంలో ఆమె కొడుకు గౌస్ పీర్, కోడలు హుస్నేబీ లు అడ్డుపడి పొలానికి నీళ్ల కట్టుకోకుండా చేయడంతో పాటు ఆమె పైన దాడి చేసి కింద పడదోచి గాయపరిచిన విషయమై ఎస్సై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# కురులు వేగంగా పెరగాలా?

**పుట్టుకుచ్చులా అందంగా, పొడవుగా ఉండే కురులు.. కోరుకోని అమ్మాయి ఉంటుందా? కానీ ఈ కాలుష్యానికి ఊడటమే కానీ పెరగడం ఎక్కడుంది? ఈ చిన్న చిట్కాలను పాటించండి. వేగంగా పెరుగుతాయి అంటున్నారు నిపుణులు. అవేంటో చూద్దామా?**



★ తల ఆరోగ్యంగా ఉండాలంటే తరచూ దాన్ని శుభ్రం చేయడం తప్పనిసరి. కానీ ఆరబెట్టడమే పెద్ద పని. అందుకే చాలామంది డ్రైయ్యర్‌ని వాడుతుంటారు. కానీ దాని వేడి కురుల పెరుగుదలను అడ్డుకుంటుందని తెలుసా? స్టైలింగ్, స్టైలింగ్, స్ట్రెయిట్‌నింగ్ కోసం వాడేవే కాదు.. ఎండలో అతిగా తిరగడం, జడను లాగివేయడం, తువాలుతో తడిపోవాలని కొట్టడం వంటివీ చేటు చేసేవే. వీటికి దూరంగా ఉండండి.

★ కండిషనర్ వెంట్రుకలకు బాగా పడుతుంది. ఇప్పుడైతే చిక్కులు బాగా వస్తాయి. అని తడి తలమీద దువ్వెన ఉపయోగిస్తున్నారా? మేలు చేయడం మాట అటుంచితే కుదుళ్లకు హాని. ఫలితమే కురులు రాలడం. కాబట్టి, తడి వెంట్రుకలు ఆరేవరకూ ఆగండి. తరవాతే దువ్వండి.

★. ఒకప్పుడు సమస్యేదైనా నిపుణులను సంప్రదించేవారు. మరి ఇప్పుడు? అరచేతిలోనే సమాచారం. దాని సలహాతో ఇష్టారీతిన సప్లిమెంట్లను వాడేస్తున్నారు. మీదీ అదే ధోరణా? ఇవి మేలు చేయకపోగా చేటు చేస్తాయి. వాటి ప్రభావం తొలుత పడేది చర్మం, కురులపైనే! నిపుణుల సలహా లేనిదే వాడకపోవడమే మేలు.

★ త్వరగా పెరగవు అని చాలామంది కురులను కత్తిరించడానికి వెనకాడతారు. కానీ రెండు నెలలకో సారైనా ట్రిమ్ చేసుకోవాలి. చిట్లడం, చివర్లు పొడిబారడం కూడా కురుల పెరుగుదలకు అవరోధంగా మారతాయి. కాబట్టి, వాటిని తొలగించడం తప్పనిసరి.

★. జిడ్డు, సమయం లేదని బద్ధకించక వారానికి రెండుసార్లు గోరువెచ్చని నూనెతో తలకు మర్దనా చేయండి. మాడుకి రక్తప్రసరణ బాగా జరుగుతుంది. అలాగే కండిషనర్ వాడకం కూడా తప్పనిసరి. ఇది వాతావరణ పరిస్థితుల నుంచి కురులకు సంరక్షిస్తుంది.

★ దిండు కూడా కేశాల పెరుగుదలపై ప్రభావం చూపుతుందని తెలుసా? సరైన గలేబులను వాడకపోతే అవి కురుల్లోనే సహజ నూనెలను పీల్చేయడమే కాదు, రాపిడికి గురిచేసి వెంట్రుకలు తెగేలానూ చేయగలవు. కాబట్టి, శాటిన్ రకాలనే ఎంచుకోండి. చిన్నవే కదూ.. అందమైన, ఆరోగ్యకరమైన కురుల కోసం పాటించండి మరి.

# రోజ్ కోకోనట్ బర్ఫీ



**కావలసినవి :** కొబ్బరి తురుము-3 కప్పులు, పంచదార-2 కప్పులు, పాలు-అర కప్పు, పాలపొడి-అర కప్పు, రోజ్ సిరప్-పావు కప్పు, నెయ్యి 2 చెంచాలు, యాలకుల పొడి-అర చెంచా, డ్రైఫ్రూట్స్ పలుకులు- చారెడు.

**తయారీ :** కొబ్బరి తురుమును ఒక పాత్రలోకి తీసుకుని పాలు, రోజ్ సిరప్‌లు వేసి బాగా కలపాలి. చివరోల్ల నెయ్యి యాలకుల పొడి వేసి మరోసారి కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక పళ్లెంలో వేసి సమంగా సర్ది, డ్రైఫ్రూట్స్ పలుకులు చల్లాలి. కొంచెం అదిమినట్లు చేసి, ఫ్రిజ్‌లో ఉంచాలి. ఓ అరగంట తర్వాత ముక్కలుగా కట్‌చేసుకోవాలి. ఇలా సులువుగా తయారైపోతుంద న్నమాట రోజ్ కోకోనట్ బర్ఫీ.

# ఫ్రిజ్‌ను ఎలా వాడుతున్నారు?

**మారుతోన్న కాలానికి అనుగుణంగా మనలో** చాలామంది ఇళ్లలో ఫ్రిజ్ వాడకం పెరిగింది. తాజా పండ్లూ, కూరగాయలూ, పాలు, మిగిలిన కూరలేవైనా సరే.. మొదట వెళ్లేది ఫ్రిజ్‌లోకే కదా! ఆహారం పాడవకుండా ఉంటుందనుకుంటాం కానీ, ఆహారాన్ని గ్లాస్ లేదా మెటల్ డబ్బాల్లో ఉంచడం శ్రేయస్కరం. పచ్చి కూరగాయలూ, పండ్లలో నీటిశాతం తగ్గకుండా జాగ్రత్తపడాలి. ఎక్కువగా ఫ్రిజ్‌లో ఉంచిన ఆహారం తినే వాళ్లు తరచూ అనారోగ్యాలకూ గురవుతున్నారట. కమర్షియల్ కంటే



ఇంట్లో రిఫ్రిజిరేటర్ వల్ల ఆహారం కలుషితం అయ్యే అవకాశాలు మూడురెట్లు అధికంగా ఉన్నాయని పరిశోధనలూ చెబుతున్నాయి. కాబట్టి, ఫ్రిజ్‌లోని ఆహారానికి సరిగా మూతలు పెట్టడంతోపాటు ఎక్కువరోజులు ఆహారం నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఫ్రిజ్‌ను ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలి. డైరీ ఉత్పత్తులూ, వండిన ఆహారం, వండని కూరగాయలూ, పండ్లూ వంటి వాటిని విడివిడిగా సర్దుకోఆలి. అన్నింటికంటే ముఖ్యంగా ఫ్రిజ్‌లో అవసరముననవీ, లేనివీ పెట్టేసి నింపేయ కూడదు. దానివల్ల పోషక విలువలు తగ్గిపోవడమే కాక, నాణ్యతా తగ్గుతుంది. కాబట్టి, అవసరమై నంత మేరకే వండుకోవడం అలవాటు చేసుకోవాలి. ఒక్కోసారి మిగిలినా, వెంటనే తినడానికి ప్రయత్నించాలి. దానివల్ల కలిగే నష్టాలూ బోలెడు.. వండిన ఆహారమైనా, వండనిదైనా సరే.. ఫ్రిజ్‌లో పెడితే అందులోని పోషకాలు ముఖ్యంగా విటమిన్-సి, బి లు నాశనమవుతాయట. చల్లని వాతావరణంలో బ్యాక్టీరియా వృద్ధిచెందే అవకాశమూ ఎక్కువే. తద్వారా రోగనిరోధక శక్తి తగ్గిపోయి జలుబు, దగ్గు, జ్వరం..లాంటి వైరల్ వ్యాధుల బారినపడతాం. మొదట రుచిలో మార్పు కనిపిస్తుంది. ఆ తరవాత వాసన కూడా మారిపోతుంది. దీర్ఘకాలం ఇలానే తింటుంటే అనారోగ్యం పాలవుతామని చెబుతున్నారు నిపుణులు. ఎలా భద్రపరచామననదీ ముఖ్యమే.. నిజానికి ఒక్కో ఆహార పదార్థాన్నీ ఒక్కో ఉష్ణోగ్రత వద్ద భద్రపరచాలి. వండినవీ, వండకుండా ఉన్నవీ, పాల ఉత్పత్తులు.. వంటివన్నీ వేటికవే వేరుగా ఉంచాలి. వండిన



**వాళ్లెవరూ ఎంబిఎలు చదివి వ్యాపారంలో అడుగుపెట్టిన వాళ్లు కాదు. అనుభవాలనే పాఠాలుగా మార్చుకున్నా వాళ్లు. సవాళ్లతోనే మెలకువలు నేర్చుకున్న ఈ గిరిజన బిడ్డలు శానిటరీ న్యాప్కిన్ల తయారీలో రాణిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆదివాసీ మహిళలు సాధించిన విజయమిది.**

# అనుభవాలనే పాఠాలుగా నేర్చుకుని..

ఆ రోజు కూలి పని దొరికితే సరే సరి. లేదంటే ఆకలితో ఉండాలినసందే! అలాంటి పరిస్థితి నుంచి మార్కెటింగ్ మెలకువలతో వ్యాపారాన్ని కొత్తపుంతలు తొక్కించే స్థాయికి ఆదివాసీ మహిళలు వెళ్లారంటే గొప్పవిషయమేగా! లలిత, వెంకటలక్ష్మి, మంగా వీణ, సమ్మక్క, సుక్కమ్మ వంటి వారంతా పరిశ్రమ లోకి రాకముందు రోజువారీ కూలీలుగా ఉండేవారు. ఏజెన్సీ ప్రాంతంలో తగిన ఉపాధి లేక ఎన్నో ఇబ్బందులు పడ్డారు. వీళ్ల జీవితాల్లో మార్పు రావాని 2016లో ఐటిడిఏ అధికారులు శానిటరీ న్యాప్కిన్ల తయారీ పరిశ్రమను నెలకొల్పారు. అనుభవలేమి, నష్టాలతో ఆ ప్రయత్నం విఫలమైంది. దాంతో అధికారులు మరిన్ని జాగ్రత్తలు తీసుకుని రెండో ప్రయత్నం చేశారు. హైదరాబాద్, ముంబయి, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో నాప్కిన్స్ తయారీ ఎలా ఉంటుందో అధ్యయనం చేయించారు. శిక్షణ ఇప్పించారు. మహిళల్లో ఆత్మవిశ్వాసం వచ్చాక 2018లో ఆధునిక మెషినరీని సమకూర్చారు.



ప్రభుత్వ రాయితీ, బ్యాంకు రుణంతో ఆదివాసీ మహిళలూ తాము దాచుకున్న సొమ్ముని పెట్టుబడిగా పెట్టారు. అలా 2020 నుంచి న్యాప్కిన్ల ఉత్పత్తి మొదలైంది. గిరిజన సహకార సంస్థ (జిసిసి) సాయంతో మార్కెటింగ్‌పైనా పట్టుసాధించారు. మొదట్లో ఆశ్రమ పాఠశాలలకు ఈ న్యాప్కిన్లను సరఫరా చేసేవారు. ఆ తరవాత కళాశాలలు, ఎస్సీ, ఎస్టీ గురుకులాలు, జెడ్పీ ఉన్నత పాఠశాలలకు నెలకు 60 వేల వరకూ న్యాప్కిన్స్ తయారుచేసేవారు. అంతా బాగుందనుకుంటే కొవిడ్ ముంచుకొచ్చింది. ఆర్డర్లు లేవు. పరిస్థితి మొదటికొచ్చింది. ఆ స్థితి నుంచి కోలుకోవడానికి సమయం పట్టినా నాణ్యతలో రాజీపడకుండా తిరిగి ఆర్డర్లు సంపాదించారు. ప్రస్తుతం ఉమ్మడి ఖమ్మ, వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లోని విద్యాసంస్థలకు తమ ఉత్పత్తులను అందిస్తున్నారు. ఒక్కో మహిళా నెలకు సుమారు రూ.10-15వేల వరు సంపాదిస్తున్నారు. వీరిన ఇఊసి మరికొందరూ చిన్న పరిశ్రమల స్థాపనకు ముందుకొస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

# రాయలసీమ గొంతు కోసిన పాపం వైసిపిదే

గజదొంగల సమక్షంలో నీతులు చెప్తే ఎలా?.. శైలజానాథ్‌పై నిప్పులు చెరిగిన జగన్మోహన్ రాజు

రాజంపేట, జూలై 19 ప్రభాతవార్త

పర్యావరణ చట్టాలను తుంగలో తొక్కి ప్రాజెక్టును కోట్లు చుట్టూ తిరిగేలా చేసి రాయలసీమ గొంతు కోసిన పాపం వైసిపి దే అని,అన్ని అడ్డంకులు తొలగించి రాయలసీమకు నీరు అందించేలా కృషి చేస్తున్న తెలుగుదేశం పార్టీపై విమర్శలు చేసే నైతిక హక్కు వైసిపికి లేదని,గజదొంగల సమక్షంలో నీతులు చెప్తే ఎలా అని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. వైసిపి నేత సాకే శైలజానాథ్ ఇచ్చి పోతగల పథకంపై చేసిన వ్యాఖ్యలపై చమర్తి నిప్పులు చెరిగారు.గజదొంగల గుంపులో మరో గజదొంగలా తయారవ్వకు సాకే అంటూ మండిపడ్డారు. రాజంపేట ఎమ్మెల్యే అమర్ రెడ్డి ,ఆయన సోదరుడు అనిల్ కుమార్ రెడ్డిలాంటి గజదొంగల సమక్షంలో నీతులు చెప్తే ఎలా అని ప్రశ్నించారు. అవినీతి కట్టడంలో బస చేసి టిడిపినీ విమర్శించే నైతిక హక్కు శైలజానాథ్‌కి లేదని మండిపడ్డారు. రాయలసీమ ద్రోహి గొడ్డలి పార్టీ అని ధ్వజమెత్తారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను కూటమి ప్రభుత్వం ఆపేసిందని సిగ్గు లేకుండా మాట్లాడడం తగదని,చట్ట వ్యతిరేక తప్పులు చేసి ఎన్జీటీ అనుమతులు రాకుండా స్టే ఇచ్చేలా కుట్ర పన్నింది గొడ్డలి పార్టీనే అన్నారు. రాయలసీమకు అభయహస్తం కూటమి ప్రభుత్వమని, రాయలసీమ సాగు, తాగు నీరు అందించే భగీరథుడు చంద్రబాబే అని కొనియాడారు.మీ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చింది చంద్రబాబే కదా అన్నారు. అనంతపురం జిల్లాలో నెలకొన్న పరిశ్రమలు నీకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రాజంపేటకు పట్టిన శని ఆకేపాటి సోదరులనీ విమర్శించారు. అన్నమయ్య డ్యామ్‌ను ముంచింది ఎవరు, ప్రజల ప్రాణాలు తీసింది ఎవరు తెలుసుకొని మాట్లాడాలన్నారు. రెండేళ్లలో గాలేరు నగరి ప్రాజెక్టు పూర్తి చేసి అన్నమయ్య ప్రాజెక్టును స్టోరేజ్ రిజర్వాయర్గాపూర్తి చేస్తామన్నారు.జిల్లా కేంద్రం ,మెడికల్ కాలేజీ తో పాటు ఇక్కడి ప్రభుత్వ కార్యక్రమాలు తరలించిన దరిద్రులు వైసీపీ వారు కాదా అని జగన్మోహన్ రాజు ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ గన్నే సుబ్బనరసయ్య నాయుడు,వైస్ ఛైర్మన్ చెంగల్ రాయుడు, పార్టీ గ్రామీణ అధ్యక్షుడు మేడికొండ రవికుమార్, ఈడిమడకల కుమార్, ఉద్దండం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్ రాజు

## దాతల సహకారంతో లయన్స్ సేవలు విస్తృతం

రామాపురం జూలై 19 ప్రభాతవార్త:

సేవలకు మారుపేరుగా లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ నిలిచిందని ఛైర్మన్ మరియు అధ్యక్షులు రామాంజనేయు రెడ్డిలు అన్నారుశనివారం రాత్రి లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో సిబ్యాల గ్రామం బలిజపల్లి వాస్తవ్యులు కీ:శే గుగ్గిళ్ళ వెంకట రమణ మూడవ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు గంగాధర్,వెంకటేష్ ఆర్థిక సహాయంతో ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అధ్యక్షులు లయన్ యస్.అంజి రెడ్డి తెలిపారు.అనంతరం దాతలు గంగాధర్, వెంకటేష్ గార్లు మాట్లాడుతూ ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఛైర్మన్ లయన్ షేక్.మహమ్మద్, మాజీ అధ్యక్షులు లయన్ పసుపులేటి శ్యామ్,దాత కుటుంబ సభ్యులు మరియు ఆశ్రమం మేనేజర్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థినులకు మెటీరియల్ కిట్లు పంపిణీ



బద్వేలు, జూలై 19, ప్రభాతవార్త

బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని కోటవీధిలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలికల ఎస్సీ-1, ఎస్సీ-2 వసతి గృహ విద్యార్థినులకు శనివారం మెటీరియల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి బద్వేలు టీడీపీ ఇన్‌చార్జి, ఉమ్మడి కడప డీసీసీ బ్యాంకు ఛైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు బెడ్‌షీట్లు, కార్పెట్లు, టర్కీ టవల్స్, నైట్‌డ్రెస్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులకు తాను తీసుకువచ్చిన నోట్‌బుక్స్‌ను పంపిణీ చేసి, వారితో కలిసి టిఫిన్ చేశారు. విద్యార్థినుల సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, వసతి గృహ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనుమానిత నేరస్థులకు కౌన్సెలింగ్



ముద్దనూరు, జూలై 19 ప్రభాతవార్త:

కడప జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ముద్దనూరు పోలీస్ స్టేషన్‌లో ఆదివారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) నగేష్ బాబు మండలంలోని రౌడీ షీటర్లకు, అనుమానిత నేరస్థులకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదని, వ్యక్తిగత గొడవలు, ఘర్షణలు, దాడులు వంటి సంఘటనలకు దూరంగా ఉండాలని వారికి కఠినంగా హెచ్చరించారు. అదేవిధంగా, ప్రజల్లో భయాందోళనలు కలిగించే చర్యలు, అక్రమ కార్యకలాపాలు, శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రవర్తన ఏ రూపంలోనూ సహించబోమని స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రౌడీ షీటర్లు, అనుమానిత నేరస్థుల నుంచి ఇకపై ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడబోమని హామీ తీసుకుని, తగిన సూచనలు, హెచ్చరికలు జారీ చేసి పంపించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీ అంటే అమరావతి పోలవరమేనా

ప్రొద్దుటూరు జూలై 19 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ అంటే కూటమిపాలకులకు అమరావతి పోలవరం తప్ప మరో ప్రాంత అభివృద్ధి కనబడడం లేదని రాయలసీమ విద్యావంతుల వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజశేఖర్ విమర్శించారు ఆదివారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో రాయలసీమ విద్యావంతుల వేదిక ప్రచురించిన మన రాయలసీమ నాలుగవ బులిటెన్ ఆవిష్కరణ సభ ఆర్‌వివి జిల్లా కన్వీనర్ మహమ్మద్ అధ్యక్షతన జరిగింది. ఈ సభలో రాజశేఖర్ మాట్లాడుతూ పట్టిసీమలో రాయలసీమకు నీళ్లు తెస్తామని 2014లో ఇదే పాలకులు చెప్పారన్నారు. పట్టిసీమ పూర్తయి కోస్తాలో మూడు పంటలకు నీళ్ల సదుపాయం మెరుగుపడింది తప్ప రాయలసీమకు ఆ ప్రాజెక్టు నుండి చుక్కనీరు అందలేదన్నారు. ఇప్పుడు మళ్లీ సీమ వాసులను మోసం చేయడానికి పోలవరం నుండి బనకచర్ల పేరుతో కొత్త డ్రామాకు తినలేరు అన్నారు. కానీ శ్రీశైలం నుండి రాయలసీమకు కావలసిన అన్ని నీళ్లు ఇస్తామని చెప్పడానికి పాలకులకు నోట మాట రాలేదన్నారు. సిద్దేశ్వర మలుగు గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణాలు గురించి మాట మాత్రమే ప్రస్తావించడానికి పాలకులకు మనసు రాలేదన్నారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకులు రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ సీమలో కనిజుసంపదను దోచుకోవడానికి తప్ప నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పన కోసం ప్రైవేటు పరిశ్రమలు రావడం లేదన్నారు. కోటి రూపాయల పెట్టుబడి పెడితే ఒక ఉద్యోగం ఇవ్వాలనే నిబంధనం గాలికి వదిలేసారు అన్నారు. 4000 కోట్లు పెట్టే దాల్మియా పరిశ్రమలో 4,000 మంది కార్మికులకు ఉపాధి కల్పన జరగాలన్నారు. కానీ అక్కడ ఎన్ని ఉద్యోగాలు వస్తాయో రాబోయే రోజుల్లో అది తేటతెల్లమవుతుందన్నారు. 16,500 కోట్లతో ఉక్కు పరిశ్రమ పెడితే అంత మందికి మరి ఉద్యోగాలు ఇవ్వవలసి ఉంటుందన్నారు కానీ పాలకులు దానిమీద దొంగ లెక్కలు చెబుతున్నారు అన్నారు ఈ కార్యక్రమంలో రచయితలు దాదా హయత్ పాలగిరి విశ్వ ప్రసాద్ చదువుల బాబు వరలక్ష్మి సికిందర్ బసవరాజు వేణుగోపాల్ ఆర్ వి జిల్లా కన్వీనర్లు కోకన్వీనర్ల హరిత జగదీష్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సిఎంఎస్ జిల్లా కన్వీనర్ పద్మ ఆర్‌ఎంఎస్ కార్యదర్శి లక్ష్మీదేవి సిఎల్సి జిల్లా కన్వీనర్ సురేష్ బాబు పికెఎస్ శ్రీనివాసులు రెడ్డి బీసీ సంఘం నేత కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



## వర్షాలు కోసం అమ్మవారికి జలాభిషేకం

సంబేపల్లి జూలై 19 ప్రభాతవార్త



సంబేపల్లి మండలం నారాయణరెడ్డి పల్లె గ్రామం శ్రీ మంచాలమ్మ తల్లి ఆలయంలో వర్షాలు కురవాలంటూ మహిళలు భక్తిశ్రద్ధలతో 108 బిందెలతో జలాభిషేకం చేపట్టారు. మంచాలమ్మ తల్లి వర్షాలు సమృద్ధిగా పంపించాలంటూ భక్తి శ్రద్ధలతో పూజలునిర్వహించారు. ప్రస్తుతం వర్షాలు పడకపోవడం. కరువు పరిస్థితుల నుండి కాపాడాలి అమ్మ అంటూ అమ్మవారిని కోరుకున్నారు పాడిపంటలతో ఈ ప్రాంతం సమృద్ధిగా ఉండాలని అమ్మవారి కోరుకున్నారు ఈ సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించారు అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు . భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు.

## తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం



రాయచోటి జూలై 19 ప్రభాతవార్త

ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అనుబంధ సంఘం తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా ఎన్నికలు కడప జిల్లా తెలుగు నాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లయ్య అధ్యక్షతన రాష్ట్ర ఉపాధ్యక్షులు సిద్దయ్య పర్యవేక్షణలో ఏపీ ఎన్జీజీవోస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఎం వేణుగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా సమావేశం నిర్వహించి ఎన్నికలు నిర్వహించడమైనది.అధ్యక్షులు జి రాజేంద్ర సహాధ్యక్షులు పి రమణమ్మ ఉపాధ్యక్షులు యు నీలిమ ఎస్ సావిత్రి ఎంఅంజనమ్మ ఎం రఘునాథ్ నాయక్ జి పార్వతమ్మ బి అమర కార్యదర్శి కె శ్రీ విద్యావతి కార్యనిర్వాహక కార్యదర్శి ఎం ధర్మారెడ్డి సంయుక్త కార్యదర్శిలు జై శశికళ ఎస్కే షాహిదా కే సంధ్యారాణి ఎస్ గౌహార్ జహాన్ టి శంకరమ్మ ఎస్ రెడ్డమ్మ కోశాధికారి ఖాజాబీ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో ఎన్జీవో నాయకులు శివారెడ్డి మహాదేవ రాజశేఖర్ రెడ్డి ప్రతిభ కుమారి మరియు తదితరులు పాల్గొన్నారు.

## వర్షకోసం మదనపల్లెలో ముస్లింలు ప్రార్థనలు


ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

మదనపల్లె, జూలై 19 ప్రభాతవార్త :

వర్షంకోసం మదనపల్లెలోని టిప్పు సుల్తాన్ మైదానంలో ఆదివారం ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వర్షాలు సంవృద్ధిగా కురవాలని కోరుతూ ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనల్లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పాల్గొని ప్రార్థనలు చేశారు. వర్షాలు లేక నీటికి ఇబ్బందులు పడుతున్నారని, పశు పక్షాదులు తాగునీటి కోసం ఇబ్బందులు తొలిగిపోవాలంటే సంవృద్ధిగా వర్షాలు కురవాలని ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. పట్టణంలోని ముస్లిం మతపెద్దలు వర్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు. పట్టణంలోని పలు మసీదులకు చెందిన ముస్లిం సోదరులు పెద్దఎత్తున ప్రార్థనల్లో పాల్గొన్నారు.

## శిల్పారమంలో అలరించిన చిన్నారుల పాటలు

కడప కార్పొరేషన్ జూలై 19 ప్రభాతవార్త:



కడప శిల్పారామంలో ఆదివారం సాయంత్రం 6.30 నిమిషాలకు సాంస్కృతి కళావేదికపైన పద్మాకర్ వారి సహకారంతో రాజస్థాన్లో చిన్న పాప మీద జరిగిన యదార్థ సంఘటనలు డాన్స్ రూపంలో కడప నగరానికి చెందిన అఖీఫా ప్రదర్శనతో ప్రేక్షకుల హృదయాలను చలించి వేసింది. అనంతరం నగరానికి చెందిన సరేశ్వర్ డాన్స్ అకాడమీ వారు పల్లె జానపదాలు శాస్త్రీయ నృత్యాలు సినీ నృత్యాలతో ప్రేక్షకులను అలరించాయి. గరం గరం పోరి, రంగేళి రంగేళి, గోదావరి గట్టు మీద రామచిలకవే వంటి పాటలకు చిన్నారులం నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో శిల్పారామం పరిపాలన అధికారి పి.శివ ప్రసాద్ రెడ్డి పర్యవేక్షించారు.

## విద్యనే విజయానికి మార్గం..



వేంపల్లె జూలై 19 ప్రభాతవార్త

వేంపల్లెలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో శనివారం 130 మంది విద్యార్థినులకు ప్రభుత్వం అందజేస్తున్న మెటీరియల్స్‌ను పంపిణీ చేసినట్లు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (హెచ్‌డబ్ల్యూఓ) సుజాత తెలిపారు.ఈ సందర్భంగా ప్రతి విద్యార్థినికి రెండు జతల సిల్క్ యూనిఫాంలు, ఒక టవల్, రెండు నైట్ డ్రెస్సులను అందజేశారు. అనంతరం హెచ్‌డబ్ల్యూఓ సుజాత మాట్లాడుతూ, వసతి గృహంలో విద్యార్థినులకు అవసరమైన అన్ని సౌకర్యాలు, వసతులు ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొన్నారు.ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించాలని ఆమె సూచించారు. విద్యలో రాణించి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడం ద్వారా తల్లిదండ్రులకు, వసతి గృహానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు విద్యార్థినుల విద్యాభివృద్ధికి ఎంతో దోహదపడతాయని, వాటిని సక్రమంగా వినియోగించుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విద్యార్థినుల తల్లిదండ్రులు, హాస్టల్ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యాధి నిరోధక టీకాలు చిన్నారుల జన్మ హక్కు

పీలేరు జూలై 19 ప్రభాతవార్త:

నిర్దేశించిన సమయానికి టీకాలు వేయించి పిల్లల జీవితాల్ని ఆనందాల హరివిల్లుగా మార్చాలని పి.హెచ్.సి తలుపుల ప్రదానవైద్యాధికారులు శ్రీగిరీష తల్లులకు పిలుపు నిచ్చారు. ఆదివారం పి.హెచ్.సి తలపులలో ఒక ప్రకటన చేస్తూ రేపు నిర్వహించబోయే పిల్లకు వేయు మీసిల్స్, రూబెల్లా టీకాల ప్రత్యేక శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రమాదకరమైన వైరస్ జబ్బులు పిల్లలలో న్యూమోనియా, డయేరియా, అంటుకు దారి తీసి ఒక్కోసారి మరణం కూడా సంభవించే పై సూచించిన రెండు జబ్బులనుండి పిల్లల్ని కాపాడాలని, మరియు గర్భసమయములో మృత శిశువులు జన్మించడం, పుట్టుకతో లోపాలు గల (వినపడక పోవడం, మూగ, గుండె సంబందించిన సమస్య )శిశువులు జన్మించడం ప్రమాదం కూడా లేకపోలేదని, వైద్యురాలు శ్రీ గిరీష అన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా రెండు డోసులు ఎమ్. ఆర్ వ్యాక్సిన్ మొదటి డోస్ 912నెలల లోపు, రెండవ డోస్ 1624నెలలలోపు పిల్లలకు ఇస్తున్నారు. పై తెలుపబడిన వయసు పిల్లలు ఎరరైనా ఎమ్. ఆర్. టీకాలు వేయించుకోక పోయి ఉంటే వారి కొరకు ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా వలస వెళ్లే వారు, మురికివాడ లలో నివసించే వారు, ఇటుక బట్టీల దగ్గర ఉండేవారు, భవన నిర్మాణల దగ్గర ఉండేవారు, కూలి పనులు జరిగే చోట, వ్యవసాయ పనులు జరుగు చోట లబ్దిదారులను గుర్తించి తట్టు, కేసులు లేకుండా చేయు కార్యక్రమం లో అందరూ భాగస్వాములు కావాలని డా:శ్రీ గిరీష సూచనలిచ్చారు.కార్యక్రమంలో డిప్యూటి హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కొండయ్య పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శనలు




పులివెందుల, జూలై 19 ప్రభాత వార్త :

పట్టణంలోని శిల్పారామం నందు ఆదివారం నిర్వహించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సీఎం అవార్డు గ్రహీత ఎం. విజయశాంతి ఆధ్వర్యంలోని ముద్ర డాన్స్ స్కూల్, కడప విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు 'బ్రహ్మముక్కటే', 'ప్రాణవాలయ', 'బాయిలోనే', 'దారి చూడు', 'తస్సదియ్య' తదితర పాటలకు అందంగా నృత్యాలు ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలతో శిల్పారామం ప్రాంగణం సందడిగా మారింది. ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో చిన్నారులను ప్రోత్సహిస్తూ అభినందించారు. కార్యక్రమ ఏర్పాట్లను శిల్పారామం సాంస్కృతిక పరిపాలన అధికారి టి. విశ్వనాథ్ రెడ్డి, పరిపాలన అధికారి బి. సుధాకర్ పర్యవేక్షించారు. సూపర్వైజర్లు బి. సుబ్బారావు, ఎం. ఇస్మాయిల్, సౌండ్ సిస్టం ఆపరేటర్ కిషోర్తో పాటు ఇతర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

సుండుపల్లె, జూలై 19,ప్రభాతవార్త :

సుండుపల్లె-గుండ్లపల్లి మార్గంలోని వడ్లపల్లి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సుబ్బరాయుడు (50) ప్రయాణిస్తున్న మోటార్ వాహనం అదుపుతప్పడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం గాయపడిన సుబ్బరాయుడిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## రోడ్డు వేయాలని ఎమ్మెల్యేకు వినతి

గుడి అభివృద్ధికి సహకరించాలని గ్రామస్తుల వినతి


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి

పీలేరు జూలై 19 ప్రభాతవార్త:

నియోజకవర్గంలోని పీలేరు మండలం మర్రి మాకులపల్లి తండాలో రోడ్డు వసతి కల్పించాలని నగిరిపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గ్రామస్తులు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, గ్రామస్తులకు సమస్యగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా తండాలోని శ్రీ మారెమ్మ గుడి అభివృద్ధికి కూడా నిధులు మంజూరు చేసి సహకరించాలని వినతి పత్రంలో పొందుపరిచారు. సమస్యను చదివి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడారు. తండాకు రోడ్డు నిర్మాణానికి త్వరలో చర్యలు తీసుకుంటామని, గుడి అభివృద్ధికి కూడా ప్రభుత్వ నిధులు తెచ్చేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అశోక్ నాయక్, రూపేష్ నాయక్, మంజుల అన్న నాయక్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత..

బ్రహ్మంగారిమఠం జూలై 19 ప్రభాతవార్త



మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమీకృత వసతి సముదాయం మరియు సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం 1 లోని విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న బెడ్‌షీట్, కార్పెట్, టర్కీ టవల్, నైట్ డ్రెస్ కిట్లను ఎంపీపీ వీరనారాయణరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో సమీకృత సంక్షేమ వసతి అధికారి మునెయ్య, సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం 1 అధికారి లక్కినేని బాబు,వార్డెన్ నరసింహారెడ్డి విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు సంక్షేమ సామగ్రి పంపిణీ

మైదుకూరు, జూలై 19, ప్రభాతవార్త:

మైదుకూరు ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో ఆదివారం విద్యార్థులకు దుప్పట్లు, స్వెటర్లు, టవల్స్, నైట్‌వేర్ దుస్తులు, బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి మైదుకూరు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఆకుల కృష్ణయ్య, నియోజకవర్గ యంగ్ ప్రొఫెషనల్ పువ్వాడి వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై సామగ్రిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ, విద్యార్థుల విద్యాభివృద్ధి, ఆరోగ్యం, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొని వసతి గృహ సౌకర్యాలు, విద్యాభ్యాసంపై ఆరా తీశారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఆకుల కృష్ణయ్య, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ డేవిడ్, వసతి గృహ వార్డెన్ రామ గుప్తా, బీసీ వసతి గృహ వార్డెన్ రమణారెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## గవిగుండు శివాలయం వద్ద క్లీన్ అండ్ గ్రీన్

మదనపల్లె, జూలై 19 ప్రభాతవార్త

ఇండోటిబెటన్ బోర్డర్ పోలీస్‌లకు చెందిన హెచ్. సి సిరిగల రెడ్డెప్ప ఆధ్వర్యంలో, సీటీఎంకు చెందిన హరి డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు, క్రాస్ రోడ్ పంచాయతీ ఇందిరమ్మ కాలనీ ప్రజలు ఆదివారం గవిగుండు శివాలయం పరిసరాల్లో విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి పరిశుభ్రం చేశారు. ముళ్ళు, ఇతర వ్యర్థాలను తొలగించారు. ఆలయానికి వచ్చే భక్తులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, పరిశుభ్రమైన పరిసరాలు ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో హరి డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు, ఇందిరమ్మ కాలనీ కి చెందిన మంజుల, భవాని, రెడ్డెమ్మ, అంజమ్మ, కిరణ్ కుమారి, సోమశేఖర్, హనుమంత్ రెడ్డి, శ్రీనివాసులు, సతీష్,,రమేష్ చిట్టీ, మల్లెల వాసు, విగ్నేష్, రామచంద్ర,మహిళలు, యువకులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొని స్వచ్ఛందంగా సేవలందించారు.



## జర్నలిస్టులు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలవాలి



పులివెందుల జూలై 19 ప్రభాత వార్త :

ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా పాత్ర అత్యంత కీలకమని తుంగభద్ర ప్రాజెక్టు హై లెవల్ కెనాల్ ఛైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి అన్నారు. పులివెందుల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జయరామ కృష్ణారెడ్డి, క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మారెడ్డి జోగిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన 16 మంది కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మారెడ్డి జోగిరెడ్డి మాట్లాడుతూ మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమన్నారు. సమాజంలో జరిగే పరిణామాలను నిష్పాక్షికంగా ప్రజలకు చేరవేస్తూ, ప్రజలకు-ప్రభుత్వానికి మధ్య జర్నలిస్టులు వారధిగా కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హజ్ అండ్ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మహబూబ్ బాషా, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి,టీడీపీ సీనియర్ నాయకుడు నల్లగారి భాస్కర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి, జనసేన నియోజక వర్గ ఇన్చార్జి హరీష్ ,కూటమి నాయకులు, కార్యకర్తలు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.